ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:125 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 26-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

ఒక కలం చేసిన అద్భుత సృష్టి
మన రాజ్యాంగం, ఎందరో మహనీయుల
ఆలోచనల సమ్మేళనం మన రాజ్యాంగం..
రాజ్యాంగం అంటే కేవలం
కొన్ని పుస్తకపు పేజీలు కాదు...
అది కోట్లాది భారతీయుల ఆశలకు
అక్షరరూపం..
అది అణగారిన వర్గాల ఆత్మగౌరవం,
అది పేదవాడి హక్కులకు భరోసా,
అది ప్రతి పౌరుడి స్వేచ్ఛకు రక్షణ కవచం..
అంబేద్కర్ గారి కలం నుంచి జాలువారిన
అక్షరాలు, భారత ప్రజాస్వామ్యానికి
నిలువెత్తు దిక్సూచులు.,
అంబేద్కర్ గారి ఆశయాలకు
అసలైన నివాళి ఏం అనగా..
విద్యతో చైతన్యం రావాలి,
చైతన్యంతో ప్రశ్నించే తత్వం పెరగాలి,
ప్రశ్నలతో ప్రజాస్వామ్యం బలపడాలి,
సమానత్వంతో సమాజం ముందుకు
సాగాలి, రాజ్యాంగం చేతిలో ఉండటం
గొప్ప కాదు...
రాజ్యాంగం మన ఆలోచనల్లో ఉండాలి..
రాజ్యాంగం చట్ట సభల్లో వినిపించడం కాదు
ప్రతి సామాన్యుడి జీవితంలో కనిపించాలి...
కానీ నేడు పాలకులు...
ఒక్కసారి ఆలోచించండి.,
రాజ్యాంగం చూపిన బాటలోనే
మీ పాలన సాగుతోందా?
అధికారం వచ్చిందని అహంకారంతో
వ్యవహరిస్తున్నారా?
ప్రజల గొంతుకను వినకుండా
మౌనంగా ఉండమంటున్నారా?
రాజ్యాంగం అధికారమిచ్చింది...
అంతులేని అధికారం కాదని
గుర్తుంచుకోండి..,ప్రజాస్వామ్యం పాలించే
హక్కునిచ్చింది..ప్రశ్నించే ప్రజల గొంతును
నొక్కే హక్కు కాదని తెలుసుకోండి..

జాజుల దినేష్ .
సామాజిక విశ్లేషకులు,
నల్గొండ జిల్లా

తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభ వేడుకలు
- గచ్చిబౌలిలో ముగింపు కార్యక్రమం
- ప్రదర్శన క్రీడగా తెలంగాణ సంప్రదాయ యుద్ధకళ కర్రసాము
- 27 క్రీడాంశాల్లో 1,334 మంది రాష్ట్ర క్రీడాకారులకు శిక్షణ
- 20 స్టేడియాల్లో అభివృద్ధి పనులు
- 14 చోట్ల ఇప్పటికే పూర్తి
- నిర్వహణకు రూ.203 కోట్లు ఖర్చు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో తొలిసారిగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఈ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఏర్పాట్లలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు.

ఎల్బీ స్టేడియంలో ప్రారంభం.. గచ్చిబౌలిలో ముగింపు

డిసెంబర్ 11న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 22న గచ్చిబౌలి స్టేడియంలో ముగింపు కార్యక్రమం జరగనుంది. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరమంతా క్రీడా వాతావరణం కనిపించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రారంభ, ముగింపు వేడుకల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించాలని చెప్పారు.

జిల్లాలవారీగా మంత్రులకు బాధ్యతలు

హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లోనూ పోటీలు జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలవారీగా మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధ్యతలు కేటాయించిన మంత్రులు ఆయా జిల్లాల్లో స్టేడియాల అభివృద్ధి, క్రీడా పోటీలు, ఇతర సదుపాయాల పురోగతిని పరిశీలించనున్నారు.– హైదరాబాద్: పొన్నం ప్రభాకర్– రంగారెడ్డి: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు– మహబూబ్‌నగర్: జూపల్లి కృష్ణారావు– వరంగల్: పొంగులేటి శ్రీనివాసరెడ్డి– కరీంనగర్: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్– ఖమ్మం: తుమ్మల నాగేశ్వరరావు– నిజామాబాద్: ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి

ప్రదర్శన క్రీడగా కర్రసాము

ఈసారి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ సంప్రదాయ యుద్ధకళ కర్రసామును ప్రదర్శన క్రీడగా ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర సంప్రదాయ క్రీడలకు గుర్తింపు తీసుకురావడంతో పాటు యువతలో వాటిపై ఆసక్తి పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ స్థాయి క్రీడా వేదికపై కర్రసామును ప్రదర్శించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా కర్రసాముకు సంబంధించిన బ్రోచర్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

20 స్టేడియాల్లో అభివృద్ధి పనులు

క్రీడల కోసం ఎంపిక చేసిన స్టేడియాల పునరుద్ధరణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. పనుల పురోగతిపై విజిలెన్స్ నిఘా ఉండాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. మొత్తం 20 స్టేడియాల్లో అభివృద్ధి పనులు చేపట్టగా, ఇప్పటికే 14 చోట్ల పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన ఆరు స్టేడియాల్లోనూ ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. 27 క్రీడాంశాలకు అవసరమైన

మిగతా 2లో

పెళ్లి భరాత్‌లో కత్తులతో యువకుల హల్‌చల్

- నలుగురు అరెస్ట్
- రేతిబౌలిలో వివాహ ఊరేగింపులో కత్తులతో విన్యాసాలు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో
- వీడియో ఆధారంగా నలుగురు యువకులను గుర్తించిన పోలీసులు
- రెండు స్టీల్, రెండు ప్లాస్టిక్ కత్తులు స్వాధీనం
- ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు

2 లో



డిజిటల్ అరెస్టు మోసాలతో రూ.320 కోట్లు స్వాహా

- తెలంగాణలో 5,097 ఫిర్యాదులు
- 2026 జనవరి–అక్టోబర్ మధ్య రూ.50 కోట్ల మేర మోసం
- పది నెలల్లో 846 ఫిర్యాదులు
- 241 ఎఫ్ఐఆర్‌లు
- 2024 నుంచి ఇప్పటివరకు 5,097 ఫిర్యాదులు
- మూడేళ్లలో బాధితులు కోల్పోయిన సొమ్ము రూ.320 కోట్లు
- పోలీసు, సీబీఐ, ఈడీ అధికారులమంటూ నకిలీ బెదిరింపులు
- అప్రమత్తంగా ఉండాలని.. 1930కు ఫిర్యాదు చేయాలని సూచన

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజలను భయపెట్టి భారీగా డబ్బులు దోచుకుంటున్నారు. పోలీసు, సీబీఐ, ఈడీ, ట్రాయ్ అధికారులమంటూ ఫోన్ చేసి నకిలీ అరెస్టు వారెంట్లు చూపిస్తూ బాధితులను మానసికంగా వేధిస్తున్నారు. వీడియో కాల్స్ ద్వారా నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు నమ్మించి వారి జీవితకాల పొదుపును కాజేస్తున్నారు. 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు ఈ తరహా మోసాల ద్వారా రాష్ట్రంలో రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పది నెలల్లో 846 ఫిర్యాదులు

టీజీసీఎస్‌బీ వివరాల ప్రకారం.. 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు డిజిటల్ అరెస్టు మోసాలపై 846 ఫిర్యాదులు అందగా, 241 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 2024 జనవరి నుంచి 2026 అక్టోబర్ వరకు మొత్తం 5,097 ఫిర్యాదులు అందాయి. బాధితులు కోల్పోయిన సొమ్ము రూ.320 కోట్లకు చేరింది. ఈ కేసుల్లో ఇప్పటివరకు 1,697 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు బ్యూరో తెలిపింది.

ఫిర్యాదులు తగ్గినా.. నష్టం మాత్రం భారీగానే

గణాంకాల ప్రకారం 2024లో నెలకు సగటున 253 ఫిర్యాదులు అందగా, 2025లో ఈ సంఖ్య 101కు తగ్గింది. 2026లో నెలకు సగటున 85 ఫిర్యాదులు నమోదవుతున్నాయి. ఫిర్యాదుల సంఖ్య తగ్గుతున్నప్పటికీ ఆర్థిక నష్టం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.



వీడియో కాల్స్‌తో మానసిక వేధింపులు

నేరగాళ్లు తొలుత బాధితులకు ఫోన్ చేసి, వారి పేరుతో అక్రమ లావాదేవీలు జరిగాయని లేదా నేరాల్లో సంబంధం ఉందని ఆరోపిస్తారు. పోలీసు, సీబీఐ, ఈడీ అధికారుల మని పరిచయం చేసుకుంటూ నకిలీ పత్రాలు, అరెస్టు వారెంట్లు చూపిస్తారు. అనంతరం వీడియో కాల్స్ చేస్తూ బాధితులను నిరంతరం తమ నిఘాలో ఉన్నట్లు నమ్మిస్తారు.కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి ఫోన్, వీడియో కాల్స్ నుంచి బయటకు రానివ్వకుండా మానసిక ఒత్తిడికి గురిచేస్తారు. ఎవరితోనూ మాట్లాడకూడదని, బయటకు వెళ్లకూడదని హెచ్చరిస్తారు. అయితే వీడియో కాల్ ద్వారా ఒక వ్యక్తిని చట్టబద్ధంగా అరెస్టు చేసే విధానం లేదని గుర్తించాలని పోలీసులు సూచిస్తున్నారు.

జీవితకాల పాడుపే లక్ష్యం

బాధితులను భయపెట్టి తమ నియంత్రణలోకి తీసుకున్న తర్వాత వారి బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడుల వివరాలను తెలుసుకుంటారు. విచారణ పూర్తయ్యే వరకు డబ్బును భద్రత కోసం లేదా

మిగతా 2లో

పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- రెండు నియోజకవర్గాల్లో 11.89 లక్షల మంది అర్హులుగా గుర్తింపు
- మొత్తం 12.69 లక్షల దరఖాస్తుల స్వీకరణ- 80,635 దరఖాస్తులు తిరస్కరణ
- అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులకు డిసెంబర్ 10 వరకు గడువు
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

2 లో

అయ్యప్ప స్వాముల మధ్య కులవివక్ష వివాదం

- ములుగులో దళిత భక్తుల ఆవేదన
- 20 ఏళ్లుగా కొనసాగుతున్న పాత సన్నిధానం నుంచి వేరుచేశారంటూ ఆరోపణలు
- దళితులు మాల ధరించడంతో పూజలు, భిక్ష కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని ఆవేదన
- పాత సన్నిధానానికి తాళం వేసి అడ్డుకున్నారని బాధితుల ఆరోపణ
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్
- ఆదిభట్ల టీసీఎస్ వస్త్రధారణ వివాదంతో మరోసారి చర్చకు వచ్చిన అయ్యప్ప దీక్ష అంశం



ప్రజా వాయిస్, సిద్దిపేట: కులమతాలకు అతీతంగా భక్తులంతా ఒక్కటిగా దీక్ష చేపట్టే అయ్యప్ప స్వామి ఆరాధనలో కులవివక్ష ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో దళితులు అయ్యప్ప మాల ధరించడంతో ఇతర వర్గాలకు చెందిన స్వాములు వారితో కలిసి పూజలు, భిక్ష కార్యక్రమాల్లో పాల్గొనడానికి నిరాకరించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. గత 20 ఏళ్లుగా అందరూ కలిసి నిర్వహిస్తున్న పాత సన్నిధానాన్ని విడిచిపెట్టి ప్రత్యేకంగా మరో సన్నిధానం ఏర్పాటు చేసుకున్నారని దళిత అయ్యప్ప స్వాములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళితులు మాల ధరించడంతోనే వివాదమా?

ములుగు మండల కేంద్రంలో సుమారు రెండు దశాబ్దాలుగా అయ్యప్ప భక్తులు ఒకేచోట సన్నిధానం ఏర్పాటు చేసుకుని పూజలు, భజనలు, భిక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఏడాది తాము కూడా అయ్యప్ప మాల ధరిస్తామని దళిత భక్తులు నెల రోజుల ముందుగానే పెద్దలకు తెలియజేసినట్లు సమాచారం. అయితే దళిత భక్తులు మాల ధరించిన తర్వాత ఇతర వర్గాలకు చెందిన స్వాములు పాత సన్నిధానాన్ని విడిచిపెట్టి మరోచోట

మిగతా 2లో

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి

- కేటీఆర్
- అఖిలపక్ష నేతల అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును విడుదల చేయాలని డిమాండ్
- వేలాది మంది కార్మికుల జీవనోపాధితో భూములకు సంబంధం ఉందని వ్యాఖ్య
- ఈ నెల 27న జరగనున్న వేలాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం



ప్రజా వాయిస్, హైదరాబాద్: కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. అరెస్ట్ చేసిన నాయకులందరినీ తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా ఆస్తులను వేలం వేయొద్దు

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన ఈ భూములను వేలం వేయడం ద్వారా ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వం తాకట్టు

మిగతా 2లో

పోలీస్ శాఖలో అవినీతి కలకలం.. అక్రమార్కులపై నిఘా!

- కొన్ని పోలీస్ స్టేషన్లలో బాధితులకు వేధింపులు.. నేరస్థులతో సిబ్బంది కుమ్మక్కు
- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్న ఆదేశాలు బేఖాతరు
- మల్కాజిగిరి, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో వెలుగు చూసిన ఘటనలు
- అవినీతి ఆరోపణలతో పలువురు ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లపై చర్యలు
- అక్రమార్కులపై అంతర్గత విచారణకు సీపీ ఆదేశించినట్లు సమాచారం

2 లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపికపై కసరత్తు

- రేవంత్ ప్రతిపాదనలపై ఉత్కంఠ
- మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి
- పద్మశాలి, ముదిరాజ్ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం
- మూడో స్థానం కోసం పలువురు నేతల మధ్య పోటీ
- దాదాపు 30 మంది ఆశావహులుగా ఉన్నట్లు సమాచారం
- సామాజిక సమీకరణాలు, సామాజిక న్యాయమే ఎంపికలో కీలకం



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన దిశగా సాగుతున్న నేపథ్యంలో పచ్చే ఎన్నికలే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం వ్యూహాలకు పదును పెడుతోంది. ప్రభుత్వంలో, పార్టీలో చేపట్టాల్సిన మార్పులు, కీలక నియామకాలపై సీఎం రేవంత్‌రెడ్డితో హైకమాండ్ నేతలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఖాళీ అయిన గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై ఆసక్తి నెలకొంది. సామాజిక వర్గాలకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా సీఎం ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మూడు స్థానాలు.. సామాజిక సమీకరణాలు

తెలంగాణ పార్టీ వ్యవహారాల నూతన ఇన్‌చార్జిగా సందీప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక ఆయన ముందున్న కీలక బాధ్యతగా మారింది. గతంలో నామినేట్ అయిన బస్వరాజు సారయ్య, గోరటి వెంకన్న, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14తో ముగిసింది. దీంతో మూడు స్థానాల భర్తీకి కసరత్తు జరుగుతోంది.ఒక స్థానాన్ని పద్మశాలి వర్గానికి, మరో స్థానాన్ని ముదిరాజ్ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. మూడో స్థానం విషయంలో మాత్రం పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాల సభ్యులు, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులు కూడా ఈ స్థానం కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

పద్మశాలి కోటాలో పవిత్ర వాణి పేరు

పద్మశాలి వర్గం నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్ర వాణి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ముదిరాజ్ వర్గం నుంచి నీలం మధు, ఎం. సునీతారావు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రెండు స్థానాలపై స్పష్టత వస్తున్నట్లు పార్టీ నేతలు భావిస్తున్నప్పటికీ, తుది నిర్ణయం అధిష్ఠానం ఆమోదంపై ఆధారపడి ఉంటుంది.

మూడో స్థానం కోసం పలువురి ప్రయత్నాలు

మూడో ఎమ్మెల్సీ స్థానం కోసం ఓసీ వర్గాల నుంచి అర్దీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, గుండెపల్లి దయాసాగర్, పవన్ మల్లాది పేర్లు ప్రచారంలో ఉన్నాయి. వీరితో పాటు తెలంగాణ ఉద్యమకారులు, ఇతర రంగాలకు చెందిన నేతలు కూడా అవకాశం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద దాదాపు 30 మంది ఆశావహులు రేసులో ఉన్నట్లు సమాచారం.

సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఉంటుందా?

ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామ రామ్మోహన్‌రెడ్డి, రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిలకు పార్టీ అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీలోని పలువురు నేతలు కోరుతున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం, సామాజిక సమీకరణాల మధ్య చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

పెళ్లి భరాత్‌లో కత్తులతో యువకుల హల్‌చల్

ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని రేతిబౌలిలో జరిగిన వివాహ వేడుకలో కొందరు యువకులు కత్తులతో హల్‌చల్ చేయడం కలకలం రేపింది. పెళ్లి భరాత్ ఊరేగింపులో పెద్దపెద్ద కత్తులు చేతబట్టి విన్యాసాలు చేస్తూ డాన్స్ చేశారు. కత్తులను అడ్డదిడ్డంగా తిప్పుతూ అక్కడున్న వారిని భయాందోళనకు గురిచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

వీడియో ఆధారంగా నలుగురి గుర్తింపు

వైరల్ వీడియో ఆధారంగా కత్తులతో డాన్స్ చేసిన నలుగురిని గుడిమల్కాపూర్ పోలీసులు గుర్తించారు. కే. శ్రావణ్ కుమార్ (31), సంజయ్ కుమార్ (29), సందీప్ కుమార్ (28), దిలీప్ కుమార్ (26)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 25.5, 32 అంగుళాల పొడవున్న రెండు స్టీల్ కత్తులు, రెండు ప్లాస్టిక్ కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు

పోలీసుల వివరాల ప్రకారం.. నవంబర్ 22న బాబు జగ్జీవన్‌రావు భవన్ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులపై గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 25(1B) కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన నలుగురిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ తిరుపతి, ఇన్‌స్పెక్టర్ రామయ్య పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వేడుకల్లో ఆయుధాల ప్రదర్శనపై హెచ్చరిక

వివాహాలు, ఇతర వేడుకల్లో కత్తులు, మారణాయుధాలను ప్రదర్శించడంపై పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఆయుధాలతో హల్‌చల్ చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జనవరిలో మూసీ పునరుజ్జీవం పనులు ప్రారంభం

- 21 కి.మీ. మేర తొలి దశ
- 2027 జనవరిలో ఫేజ్-1 పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు రెండు జోన్లు
- మిరాలం చెరువు అభివృద్ధి పనులు 2028 జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- రేడియల్ రోడ్లు, పీఆర్‌ఆర్ఎస్ మార్గాలపై సీఎం రేవంత్ సమీక్ష
- కోహెడ ఫ్రూట్ మార్కెట్ పనులు, అనుసంధాన రహదారులపై ప్రత్యేక దృష్టి

ప్రజా వాయిస్, హైదరాబాద్:హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే లక్ష్యంతో చేపట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు తొలి దశ పనులను 2027 జనవరిలో ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తం 21 కిలోమీటర్ల పరిధిలో రెండు జోన్లుగా పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. మరోవైపు మిరాలం చెరువు అభివృద్ధి, రేడియల్ రోడ్లు, పీఆర్‌ఆర్ఎస్, కోహెడ ఫ్రూట్ మార్కెట్ తదితర ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

మూసీ ప్రాజెక్టుకు రెండు జోన్లు

మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు పురోగతిని అధికారులు వివరించారు. తొలి దశలో జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కిలోమీటర్లు, జోన్-1బీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 21 కిలోమీటర్ల పరిధిలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం సూచించారు.

మిరాలం చెరువు అభివృద్ధికి గడువు

మిరాలం చెరువు అభివృద్ధి పనులను 2028 జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు పరిసరాలను అభివృద్ధి చేయడంతో పాటు, చాలాకాలంగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని సీఎం ఆదేశించారు. పునరుద్ధరణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.

రేడియల్ రోడ్లు, గోశాల పనులపై ఆదేశాలు

నగరంలో రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన భూసేకరణ పురోగతిని సమీక్షించి, నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గండిపేట వద్ద నిర్మిస్తున్న ఆధునిక గోశాల పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా వేగం పెంచాలని ఆదేశించారు.

ఏసీబీలో అవినీతికి తావులేదు

- ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు
- మాజీ విద్యుత్ ఏడీఈ అంబేద్కర్ ఫిర్యాదుపై ఏసీబీ ఉన్నతాధికారుల స్పందన
- సొంత శాఖ అధికారులైనా తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టీకరణ
- దర్యాప్తు అధికారిపై వచ్చిన ఆరోపణలపై శాఖాపరమైన విచారణ
- ఆరోపణలు రుజువైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడి
- విచారణకు మూడుసార్లు పిలిచినా హాజరుకాని ఫిర్యాదుదారుడు

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారిపై మాజీ విద్యుత్ ఏడీఈ అంబేద్కర్ చేసిన ఆరోపణలపై ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఏసీబీలో అవినీతికి ఏమాత్రం తావులేదని, అవినీతిపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, సొంత శాఖకు చెందిన అధికారులైనా తప్పు చేసినట్లు నిరూపితమైతే ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు.

దర్యాప్తు అధికారిపై ఫిర్యాదు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు అధికారిపై మాజీ ఏడీఈ అంబేద్కర్ ఫిర్యాదు చేసినట్లు ఏసీబీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించడంతో పాటు, ఆరోపణలపై శాఖాపరమైన విచారణ చేపడతామని తెలిపారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విచారణకు హాజరుకాలేదన్న ఏసీబీ

మరోవైపు, ఫిర్యాదుకు సంబంధించి పూర్తి వివరాలు, వివరణ ఇచ్చేందుకు హాజరుకావాలని అంబేద్కర్‌కు ఇప్పటికే మూడుసార్లు పిలుపునిచ్చినట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. అయితే ఆయన ఒక్కసారి కూడా విచారణకు హాజరుకాలేదని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదుపై తదుపరి విచారణ ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

పోలీస్ శాఖలో అవినీతి కలకలం.. అక్రమార్కులపై నిఘా!

ప్రజా వాయిస్, హైదరాబాద్:కంచె చేను మేసిన చందంగా కొంతమంది క్షేత్రస్థాయి పోలీసుల తీరు మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన కొందరు పోలీసులే అవినీతికి పాల్పడుతూ, నేరస్థులతో సన్నిహితంగా ఉంటూ బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడమే మంచిది కాదనే అభిప్రాయానికి వచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు పలుమార్లు ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల మల్కాజిగిరి, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో పలు ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారాల్లో కొందరు ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయగా, మరికొందరు ఏసీబీకి చిక్కి అరెస్టయ్యారు.

నేరస్థులతో దోస్తీ.. బాధితులకు ఇబ్బందులు

కొంతమంది పోలీసులు నేరస్థులతో తెరవెనుక సంబంధాలు కొనసాగిస్తూ, వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాసులు కురిపించే కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సాధారణ ప్రజల ఫిర్యాదులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అంతేకాకుండా దొంగతనాలు, దోపిడీలు, మాదకద్రవ్యాల సరఫరా వంటి నేరాలకు కొందరు పోలీసులు సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి.

అవినీతి పోలీసులపై అంతర్గత విచారణ?

ఈ పరిణామాల నేపథ్యంలో అన్ని జోన్ల పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులు, అవినీతి అధికారులపై నగర పోలీస్ కమిషనర్ అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. స్పెషల్ బ్రాంచ్ అధికారులు రంగంలోకి దిగి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా పోలీస్ స్టేషన్లలో సిబ్బంది వ్యవహారశైలి, నేరస్థులతో సంబంధాలు, బాధితుల ఫిర్యాదులపై స్పందిస్తున్న తీరు వంటి అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. త్వరలోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల జాబితాను సీపీకి అందజేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విచారణలో ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయో, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్



మొదటి పేజీ తరువాయి

పరికరాల ఏర్పాటును కూడా అప్పటిలోగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.క్రీడాకారులకు మెరుగైన వసతి, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సీఎం సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అత్యుత్తమ కోచ్‌లతో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.

27 క్రీడాంశాల్లో 1,334 మందికి శిక్షణ

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ తరఫున పాల్గొనే క్రీడాకారుల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 27 క్రీడాంశాల్లో 1,334 మంది రాష్ట్ర క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే 861 మంది క్రీడాకారులు, కోచ్‌లకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

రూ.203 కోట్లతో నిర్వహణ

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.203 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21 కోట్లు కేటాయించింది. స్టేడియాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టడం, అత్యాధునిక క్రీడా పరికరాలు సమకూర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు వెచ్చిస్తోంది. ఈ పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా భవిష్యత్తులోనూ క్రీడాకారులకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో ఈ పోటీలు కీలకంగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

అయ్యప్ప స్వాముల మధ్య కులవివక్ష వివాదం

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక సన్నిధానం ఏర్పాటు చేసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

పాత సన్నిధానానికి తాళం.. ప్లాస్టిక్ కవర్ల కింద పూజలు

పాత సన్నిధానానికి తాళం వేసి తమను లోపలికి రాకుండా అడ్డుకున్నారని దళిత స్వాములు వాపోతున్నారు. దీంతో తాము ప్లాస్టిక్ కవర్లతో తాత్కాలిక పూజా ప్రాంగణం ఏర్పాటు చేసుకుని పూజలు, భిక్ష కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. అయ్యప్ప దీక్షలో అందరూ సమానమేనని భావించే సంప్రదాయంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

ఈ ఘటనపై దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ స్పందించారు. మంగళవారం ములుగు మండల కేంద్రానికి చేరుకున్న ఫ్రంట్ బృందం, కులవివక్షకు గురయ్యారని చెబుతున్న దళిత అయ్యప్ప స్వాములను కలిసి వివరాలు సేకరించింది. దళిత స్వాములతో కలిసి పూజలు, భిక్ష కార్యక్రమాల్లో పాల్గొనడానికి నిరాకరించడం, సన్నిధానానికి తాళం వేసి వారిని అడ్డుకోవడం కులవివక్ష, అంటరానితనమేనని ఫ్రంట్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత అయ్యప్ప స్వాములకు న్యాయం చేయాలని కోరారు.

ఆదిభట్ల టీసీఎస్‌లోనూ వస్త్రధారణ వివాదం

ఇటీవల రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలోని టీసీఎస్ కార్యాలయంలోనూ అయ్యప్ప దీక్షకు సంబంధించిన వివాదం చోటుచేసుకుంది. అయ్యప్ప మాల ధరించి సంప్రదాయ వస్త్రధారణతో విధులకు వెళ్లిన తనను కార్యాలయంలోకి అనుమతించలేదని మనీష్ అనే ఉద్యోగి ఆరోపించారు. సుమారు రెండు నెలల ముందే తాను దీక్ష చేపట్టనున్నట్లు యాజమాన్యానికి సమాచారం ఇచ్చినా, డ్రెస్ కోడ్ పేరుతో అడ్డుకున్నారని చెప్పారు. ఈ ఘటనపై అయ్యప్ప భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.అయితే ఇది మతపరమైన వివక్ష కాదని, సంప్రదాయ వస్త్ర ధారణకు సంబంధించి తలెత్తిన అపార్థమని ఆదిభట్ల పోలీసులు వివరణ ఇచ్చారు. ఉద్యోగిని ధోతీ మార్చి ప్యాంటు ధరించాలని హెచ్‌ఆర్ కోరినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని, పరిస్థితి అదుపులోకి వచ్చిందని వెల్లడించారు.ములుగులో దళిత అయ్యప్ప స్వాములపై కులవివక్ష చూపారన్న ఆరోపణలు, ఆదిభట్లలో ఉద్యోగి వస్త్ర ధారణపై తలెత్తిన వివాదం.. రెండు ఘటనలూ అయ్యప్ప దీక్ష సమయంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చకు దారితీశాయి. అయితే ములుగు ఘటనలో కులవివక్ష ఆరోపణలు ప్రధానంగా ఉండగా, ఆదిభట్ల ఘటనలో కార్యాలయ వస్త్రధారణ నిబంధనల అంశం తెరపైకి వచ్చింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ నియోజకవర్గాల జాబితాలను ప్రచురించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో కలిపి 12,69,191 దరఖాస్తులు అందగా, వాటిలో 11,89,191 దరఖాస్తులను అర్హమైనవిగా గుర్తించింది. మరో 80,635 దరఖాస్తులను అనర్హమైనవిగా తిరస్కరించింది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ నియోజకవర్గంలో 5,68,105 మంది అర్హులైన ఓటర్లు ఉండగా, వరంగల్–ఖమ్మం–నల్గొండ నియోజకవర్గంలో 6,21,086 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. రెండు నియోజకవర్గాల్లో కలిపి పురుష ఓటర్లు 7,10,652 మంది, మహిళా ఓటర్లు 4,78,528 మంది ఉన్నట్లు తెలిపింది. మొత్తం 1,703 పోలింగ్ కేంద్రాలకు ఆమోదం తెలిపింది.

డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలకు అవకాశం

ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, కొత్త దరఖాస్తుల స్వీకరణకు డిసెంబర్ 10వ తేదీ వరకు గడువు విధించింది. జాబితాలో పేరు లేని అర్హులైన పట్టభద్రులు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. వివరాల సవరణకు ఫారం–8, పేర్ల తొలగింపుపై అభ్యంతరాలకు ఫారం–7 సమర్పించాలని పేర్కొంది.

డిసెంబర్ 30న తుది జాబితా

ముసాయిదా ఓటర్ల జాబితాను సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. డిసెంబర్ 25వ తేదీలోగా అభ్యంతరాలను పరిష్కరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

డిజిటల్ అరెస్టు మోసాలతోరూ.320 కోట్లు స్వాహా

మొదటి పేజీ తరువాయి

లావాదేవీల ధ్రువీకరణ కోసం తాము సూచించిన ఖాతాలకు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. కొన్నిసార్లు ఆ మొత్తాన్ని తాత్కాలికంగా ప్రభుత్వ ఖాతాలో ఉంచి, తర్వాత తిరిగి చెల్లిస్తామని నమ్మిస్తారు.బాధితులు డబ్బు బదిలీ చేసిన వెంటనే నేరగాళ్లు ఆ మొత్తాన్ని ఇతర ఖాతాలకు మళ్లించడం లేదా నగదు రూపంలో ఉపసంహరించుకోవడం చేస్తారు. దీంతో మోసం గుర్తించే సమయానికి డబ్బును తిరిగి పొందడం కష్టంగా మారుతోంది.

1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి

అనుమానాస్పద కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఎవరికీ డబ్బు బదిలీ చేయకూడదని, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం వెల్లడించకూడదని హెచ్చరిస్తున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలి. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లోనూ ఫిర్యాదు నమోదు చేయాలి. త్వరగా ఫిర్యాదు చేస్తే డబ్బు బదిలీని అడ్డుకునే అవకాశం మెరుగ్గా ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు.

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి

పెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఇష్టానుసారంగా భూములను విక్రయించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించడం సరికాదని వ్యాఖ్యానించారు.

అరెస్టులపై తీవ్ర అభ్యంతరం

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ ఆరోపించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు అరెస్టయిన నాయకులందరినీ వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులతో ప్రజల గొంతును నొక్కలేరని పేర్కొన్నారు.

వేలం రద్దు చేసే వరకు పోరాటం

ఈ నెల 27న జరగనున్న ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని సూచించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ అఖిలపక్షాలతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని, వేలం రద్దు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.





పేద కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా కొండంత భరోసా!

- మోమిన్ పేట్ లో బీమా పథకం ప్రారంభం
- కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ

ప్రజా వాయిస్/మోమిన్ పేట్:పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ మోమిన్‌పేట్ గ్రామ పంచాయతీలో బుధవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ సంధ్యా సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్యా సుభాష్ గౌడ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని, కుటుంబ పెద్దకు ఆపద సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు కావడం ద్వారా అర్హులైన పేదలకు మరింత ఆర్థిక చేయూత లభిస్తుందని, వారికి పింఛన్లు అందించడం సంతోషంగా ఉందన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేష్ గౌడ్, ఉప సర్పంచ్ వెంకట్రెడ్డి, వార్డు సభ్యులు మహమ్మద్ అప్సర్, శోభన్, రమేష్, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నల్లా.. ఇంటింటికీ నిరాశ!

- కనెక్షన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా మిషన్ భగీరథ నీటి సరఫరా ఊసే లేదు
- అధికారుల నిర్లక్ష్యంతో కనెక్షన్లకే పరిమితమైన పథకం
- తాగునీటి కోసం ప్రజల అవస్థలు
- బీజేవైఎం నాయకుల జోక్యంతో ప్రజావాణికి చేరిన సమస్య



మొయినాబాద్ (ప్రజావాయిస్):నల్లా కనెక్షన్లు ఇచ్చామని చెప్పుకోవడానికి అధికారులు ముందుంటారు.. మరి ఆ నల్లాల్లో నీళ్లు పారించడానికి మాత్రం ఎందుకీ నిర్లక్ష్యం? ప్రభుత్వ పథకం కింద ఇంటింటికీ కనెక్షన్లు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా నీటి సరఫరా ప్రారంభించకపోవడంపై మొయినాబాద్ మున్సిపాలిటీలోని విజయనగర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లాలు బిగించారు.. పైపులైన్లు వేశారు.. కానీ ప్రజల దాహం తీర్చే నీళ్లు మాత్రం మరిచిపోయారా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మార్చి నెలలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారు. నెలలు గడిచినా నీటి సరఫరా ప్రారంభం కాకపోవడంతో తాగునీటి కోసం ఇతర మార్గాలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజాధనం వెచ్చించి పనులు చేపట్టినా, కనీసం నీటి సరఫరా అందించకపోతే ఆ పథకం వల్ల ప్రజలకు ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఈ నేపథ్యంలో కాలనీ వాసులు బీజేవైఎం నాయకులతో కలిసి సోమవారం ప్రజావాణిలో నోడల్ అధికారి హిమబిందుకు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీటి సరఫరా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కనెక్షన్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా, ప్రజలకు నీళ్లు అందే వరకు అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయనగర్ కాలనీవాసులతో పాటు బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మేకగూడెం మహేష్, ఎల్లేష్ గౌడ్, బీజేవైఎం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవగాహన సభలా.. అధికారుల ఫోటో సెషన్‌లా

- ఎల్ నినో ప్రభావంపై ఆరుతడి పంటల సాగు అవగాహన కార్యక్రమాలు అరకొరగా
- ఒకే రోజు ఆరు గ్రామాల్లో హడావుడి పర్యటన
- అరగంట కూడా కేటాయించని అధికారులు.
- సభలకు రైతుల హాజరు అంతంతమాత్రమే





ప్రజా వాయిస్, పెద్దపల్లి ఎల్‌నినో ప్రభావంతో రానున్న వ్యవసాయ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ అధికారుల కార్యక్రమాల నిర్వహణ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు పద్ధతులు, పెట్టుబడి వ్యయం వంటి కీలక అంశాలపై రైతులకు సమగ్ర సమాచారం అందించాల్సి ఉండగా.. ఒకే రోజు ఆరు గ్రామాల్లో అవగాహన సభలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించడం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో గ్రామానికి కనీసం అరగంట సమయం కూడా కేటాయించని ఈ షెడ్యూల్‌తో రైతులకు ఎంతవరకు ఉపయోగకరమైన సమాచారం అందుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం.. సబితంలో ఉదయం 8 గంటలకు, రంగాపూర్‌లో 8.30 గంటలకు, రాఘవాపూర్‌లో 9 గంటలకు, గౌరెడ్డిపేటలో 10 గంటలకు, అందుగులపల్లిలో 10.30 గంటలకు, దేవునిపల్లిలో 11 గంటలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లడం, రైతులను సమీకరించడం, వారికి అంశాలను వివరించడం, సందేహాలను నివృత్తి చేయడం వంటి ప్రక్రియలకు తగిన సమయం అవసరం. అలాంటిది గంటల వ్యవధిలోనే ఆరు గ్రామాల్లో కార్యక్రమాలు పూర్తి చేయాలనే షెడ్యూల్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, నీటి వినియోగం, పంటల మార్పిడి, పెట్టుబడి వ్యయం వంటి అంశాలను రైతులకు ఎంత సమగ్రంగా వివరించగలుగుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ముందుగా మీడియాకు సమాచారం ఇవ్వడం, కార్యక్రమాల అనంతరం ఫొటోలు, వార్తా కథనాలతో నివేదికలు రూపొందించడం కంటే.. రైతులకు వాస్తవంగా ఎంత ప్రయోజనం చేకూరిందన్న అంశానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో రైతుల భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని కార్యక్రమాలకు పదిమంది రైతులు కూడా హాజరుకాని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు ముందస్తు సమాచారం అందించడంలో లోపమా? గ్రామస్థాయిలో సమన్వయం కొరవడిందా? లేక కార్యక్రమాల నిర్వహణను కేవలం విధి నిర్వహణలో భాగంగానే చూస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ ముందస్తు మార్గదర్శకత్వం అందించాలి. ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాల లభ్యత, నీటి పొదుపు పద్ధతులు, పంట నష్ట నివారణ చర్యలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి. రైతులకు అనుకూలమైన సమయంలో కార్యక్రమాలు నిర్వహించి, వారి సందేహాలకు సమాధానాలు చెప్పేందుకు తగినంత సమయం కేటాయించాలి. కేవలం సభలు నిర్వహించినట్లు ఫొటోలు, నివేదికలు సమర్పించడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరదు. పంట నష్టం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందుగానే రైతులను అప్రమత్తం చేసి సరైన సాగు విధానాలపై అవగాహన కల్పించడం వ్యవసాయ శాఖ అసలు బాధ్యత. మరి ఆరు గ్రామాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా ఎంతమంది రైతులకు అవగాహన కల్పించారు? వారి సందేహాలను ఎంతవరకు నివృత్తి చేశారు? కార్యక్రమాల నిర్వహణపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.



పేద రెడ్డికి పెద్ద కష్టం

- సిలిండర్ పేలుడుతో సర్వం కోల్పోయిన పేద కుటుంబం
- రూ.12 లక్షల ఆస్తి నష్టం
- రూ.2 లక్షల నగదు, బంగారం బూడిదపాలు
- తోచినంత సాయం అందిస్తున్న రెడ్డి సంఘం గ్రూపు సభ్యులు
- దాతలు ముందుకొచ్చి ఆపదలో ఉన్న సుధాకర్ రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని "రెడ్డి సంఘం" విజ్ఞప్తి

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:వికారాబాద్ జిల్లా దోమ మండలం ఉట్‌పల్లి గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుమారు రూ.12 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదుతో పాటు బంగారం కూడా అగ్నికి ఆహుతై బూడిదలో కలిసిపోయాయి.సర్వం కోల్పోయిన కుటుంబంఈ ప్రమాదంతో ఆ కుటుంబం సర్వం కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కనీస నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకునే పరిస్థితి కూడా లేకపోవడంతో దాతలు, రెడ్డి బంధువుల సహాయం కోసం ఎదురుచూస్తోంది.అండగా నిలుస్తున్న రెడ్డి సంఘం సభ్యులుఈ నేపథ్యంలో మానవతా దృక్పథంతో స్పందించి రెడ్డి బంధువులు, గ్రూపు సభ్యులు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని రెడ్డి సంఘం వికారాబాద్ తరపున విజ్ఞప్తి చేశారు.ఆపదలో ఉన్న కుటుంబానికి మనం అందించే చిన్న సహాయం కూడా వారికి కొండంత అండగా నిలుస్తుంది. మానవత్వంతో స్పందిద్దాం.. ఆ కుటుంబానికి భరోసా కల్పిద్దాం.సహాయం అందించదలచిన వారు సంప్రదించాల్సిన వివరాలు:★ పేరు: బరడి సుధాకర్ రెడ్డి– ఫోన్ పే నంబర్: 9542668935– బ్యాంకు: ఎస్బిఐ, దోమ బ్రాంచ్– ఖాతా నంబర్: 62235941803

పరిశోధనలకు పట్టం
రామ్‌సింగ్‌కు జాతీయ స్థాయి ఫెలోషిప్

- పశువుల పునరుత్పత్తి శాస్త్రంలో విశేష సేవలకు అరుదైన గుర్తింపు
- ఇస్సార్ అసోసియేట్ ఫెలోషిప్ అవార్డు–2026 అందజేత
- పాట్నాలో జరిగిన 41వ జాతీయ సదస్సులో పురస్కారం స్వీకరణ

ప్రజావాయిస్||రాజేంద్రనగర్:పరిశోధనలే లక్ష్యంగా,పశువైద్య శాస్త్ర రంగమే వేదికగా సాగుతున్న ప్రొఫెసర్ డాక్టర్ లకావత్ రామ్‌సింగ్ ప్రయాణానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆయనకు ప్రతిష్ఠాత్మక ఇస్సార్ అసోసియేట్ ఫెలోషిప్ అవార్డు–2026 దక్కింది. పశువుల పునరుత్పత్తి శాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలు,బోధనా రంగంలో అందించిన విశేష సేవలకు ఈ పురస్కారం లభించింది.బీహార్‌లోని పాట్నా వెటర్నరీ కాలేజీలో నవంబర్ 25న నిర్వహించిన ఇస్సార్ 41వ జాతీయ సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేశారు. బీహార్ వెటర్నరీ కాలేజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఇంద్రజిత్,ఇస్సార్ అధ్యక్షుడు ప్రొఫెసర్ శివకుమార్ చేతుల మీదుగా రామ్‌సింగ్ పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా రామ్‌సింగ్ మాట్లాడుతూ..పశువుల పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం,ఆధునిక పరిశోధనల ద్వారా పశు సంపద అభివృద్ధికి తోడ్పడటం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.తన పరిశోధనలు,విద్యా సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉందని,ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఆయన రాజేంద్రనగర్ లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య కళాశాలలో వెటర్నరీ గైనకాలజీ అండ్ ఆబ్స్టెట్రిక్స్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రామ్‌సింగ్‌కు లభించిన ఈ జాతీయ పురస్కారంతో రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలకు మరోసారి ప్రత్యేక గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు,విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.



రామగుండం అర్జీ టు ఏరియాలో నిలిచిన టెండర్లు

- ఇంజనీర్ల అనుభవంపై కాంట్రాక్టర్ల ప్రశ్నలు
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- పనుల కేటాయింపులో తీవ్ర జాప్యం.
- మూడు నెలలైనా అందని బిల్లులు
- శాతం తక్కువ ధరలకు టెండర్లు.
- పెట్టుబడుల కోసం బంగారం తాకట్టు పెడుతున్న కాంట్రాక్టర్లు

ప్రజా వాయిస్ గోదావరిఖని(8వ కాలనీ)సింగరేణి రామగుండం అర్జీ టు ఏరియా పరిధిలో టెండర్ల ప్రక్రియ మందగించడం, పనుల కేటాయింపులో జాప్యం, పూర్తయిన పనులకు బిల్లుల మంజూరులో ఆలస్యం కాంట్రాక్టర్లను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్టు పనులపైనే ఆధారపడి జీవిస్తున్న నిరుద్యోగ యువకులు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ల వివరాల ప్రకారం.. రామగుండం అర్జీ టు ఏరియా పరిధిలో గత మార్చి నుంచి నవంబర్ వరకు సుమారు 70 పనులకు టెండర్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 25 లోపే టెండర్లు పిలిచారని చెబుతున్నారు. ప్రస్తుతం కొత్త టెండర్ల ప్రక్రియ కూడా నిలిచిపోయిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. దీంతో పనుల కోసం ఎదురుచూస్తున్న చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంటున్నారు. పనులు తక్కువగా ఉండటంతో కాంట్రాక్టర్లు తీవ్ర పోటీ మధ్య శాతం తక్కువ ధరలకు టెండర్లు దాఖలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే తక్కువ ధరలకు పనులు చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమపై, పనుల తనిఖీల సమయంలో కొందరు అధికారులు బిల్లుల మొత్తంలో రెండు శాతం వరకు కమీషన్ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు మొత్తాలు చెల్లించకపోతే బిల్లుల ఫైళ్లలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జాప్యం చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది. గతంలో పనులు జరుగుతున్న సమయంలోనే సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి బిల్లుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేవారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఒక క్వార్టర్‌లో పని పూర్తయిన తర్వాత వివిధ స్థాయిల అధికారులు పదేపదే తనిఖీలకు వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. దీనివల్ల నివాసితుల నుంచి కూడా ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో డీజీఎం స్థాయి సీనియర్ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించినప్పుడు పనుల ప్రక్రియ వేగంగా సాగేదని కాంట్రాక్టర్లు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేస్తున్న ఇద్దరు ఇంజనీర్లకు తగిన అనుభవం లేదని వారు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయి పనుల నిర్వహణ, బిల్లుల పరిశీలనలో సమన్వయ లోపాలు ఎదురవుతున్నాయని విమర్శిస్తున్నారు. రామగుండం అర్జీ టు ఏరియా పరిధిలో పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లులు చేతికి అందడానికి కనీసం మూడు నెలల సమయం పడుతోందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పనుల కోసం పెట్టుబడులు సమకూర్చుకునేందుకు ఇంట్లోని బంగారం, పుస్తెలు తాకట్టు పెట్టడం తోపాటు అప్పులు చేస్తున్నామని, తీరా పనులు పూర్తయినా బిల్లులు సకాలంలో రాక వడ్డీల భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వుడ్‌షెడ్ వంటి విభాగాల్లో సిబ్బంది సంఖ్యను తగ్గిస్తున్న తీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..
పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

రామగుండం అర్జీ టు ఏరియా పరిధిలో టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు పూర్తయిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. బిల్లుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, కమీషన్ల డిమాండ్లపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్న



కాంట్రాక్టర్ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సింగరేణి రామగుండం అర్జీ టు ఏరియా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి 8వ తరగతి విద్యార్థిని మృతి

- జ్వరం తగ్గించేందుకు ఇంజక్షన్ వేసిన కొద్దిసేపటికే విషమించిన ఆరోగ్యం
- మెరుగైన చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూత





ప్రజా వాయిస్ | మఠంపల్లి | నవంబర్ 25 గ్రామీణ ప్రాంతాల్లో సరైన అర్హత లేని వైద్యుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలైంది. ఆర్ఎంపీ వైద్యం వికటించడంతో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల విద్యార్థిని మృతి చెందిన విషాద ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...మఠంపల్లి మండలం గుర్రంపోడు తండాకు చెందిన ప్రమీల (13) స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గత కొద్దిరోజులుగా బాలిక జ్వరంతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆమెను మండలంలోని పెదవీడు గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన సదరు ఆర్ఎంపీ, జ్వరం తగ్గడానికి గ్లూకోజ్ బాటిల్ పెట్టి ఒక ఇంజక్షన్ వేశాడు. అయితే, ఇంజక్షన్ వేసిన కొద్దిసేపటికే ప్రమీల ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు హుటాహుటిన హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రమీల తుదిశ్వాస విడిచింది.అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కళ్లముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గుర్రంపోడు తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆర్ఎంపీ నిర్లక్ష్యపు వైద్యమే తమ బిడ్డ ప్రాణాలు తీసిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

క్యాంప్ ఆఫీస్‌పై దాడికి యత్నించడం దుర్మార్గమైన చర్య

- అభివృద్ధి పై చర్చకు సిద్ధమని సవాల్ విసిడితే
- పోలీసుల జోక్యం లేకపోయి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో
- కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు. తొందరపాటు చర్యలు చేయవద్దు ఎమ్మెల్యే నాయిని



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరితే, చర్చకు రాకుండా క్యాంప్ ఆఫీస్‌పై ధర్నా పేరుతో దాడికి ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు. నేను క్యాంప్ ఆఫీస్‌లో లేని సమయంలో, నా కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్నారని తెలిసి క్యాంప్ ఆఫీస్ వద్దకు వచ్చి ధర్నా పేరుతో దాడికి ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమైన చర్యనేను బహిరంగంగా అభివృద్ధిపై చర్చకు ఆహ్వానించాను. నిజంగా గతంలో అభివృద్ధి చేసి ఉంటే, ప్రజల ముందుకు వచ్చి ఆధారాలతో సమాధానం చెప్పాలి. పదేళ్ల పాలనలో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న మీరు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో ఎందుకు ఓడిపోయారో ప్రజలకు వివరించాలి.అభివృద్ధిపై చర్చకు రావాలని పిలిస్తే, ప్రజలు తిరస్కరించిన మాజీ ఎమ్మెల్యేలు మధ్యలో జోక్యం చేసుకొని రాజీనామాలంటూ కొత్త నాటకాలకు తెరలేపుతున్నారు. అంబేద్కర్ చౌరస్తాకు రావాలని సవాల్ విసిరితే మా నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. చర్చకు రావాల్సిన వారు మాత్రం సమాధానం చెప్పలేక వెనుదిరిగారు. గతంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులు, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన జీవోలు, ఆధారాలతో మా నాయకులు చర్చకు వచ్చారు. సమాధానం చెప్పలేక పారిపోయిన వారు ఇప్పుడు క్యాంప్ ఆఫీస్ వద్దకు వచ్చి గొడవలు సృష్టించడం ఎందుకు? రాజకీయాల పేరుతో కబ్జాలు, దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడటం కాకుండా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.పోలీసుల జోక్యం లేకపోయి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచించుకోవాలి. మరోసారి నా క్యాంప్ ఆఫీస్ జోలికి వస్తే సహించేది లేదు. ఈ విషయంలో చివరిసారిగా హెచ్చరిస్తున్నాను.

కాంగ్రెస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ తొందరపడి ఎలాంటి చర్యలకు దిగవద్దు. సంయమనం పాటించాలి. ప్రజలే అన్నీ గమనిస్తున్నారు. వారి దుర్మార్గపు చర్యలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారు. మనం అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు సాగుదాం.అభివృద్ధిపై చర్చకు నేను ఎప్పుడూ సిద్ధమే. కానీ కుటుంబ సభ్యులు ఉన్న సమయంలో క్యాంప్ ఆఫీస్‌పై దాడులకు ప్రయత్నించడం, రాజకీయాల పేరుతో అల్లర్లు సృష్టించడం మాత్రం సహించేది లేదు. అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

నిన్న ఆవేదన.. నేడు మౌనం!

- ఒక్కరోజులోనే ఇంత మార్పు ఎలా?
- రాజీనామా నిర్ణయం వెనక్కి
- అధికారులకు సహకరిస్తామంటూ ప్రకటన తెర వెనుక ఏం జరిగింది?
- చాంబర్ వైఖరిలో మార్పునకు కారణమేంటి?



ప్రజా వాయిస్, పెద్దపల్లి పెద్దపల్లి పట్టణంలో రహదారి విస్తరణ వ్యవహారం చాంబర్ ఆఫ్ కామర్స్ వేదికగా ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. నిన్నటివరకు పట్టణ అభివృద్ధి పేరుతో వ్యాపారుల ఆస్తుల విధ్వంసమా? అంటూ ప్రశ్నలు సంధించిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిషోర్ శారద.. ఒక్కరోజు తిరగకముందే తన వైఖరిలో మార్పు ప్రకటించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. నిన్నటి వరకు రహదారి విస్తరణలో 40 అడుగుల ప్రతిపాదన, వ్యాపారుల ఆస్తుల పరిస్థితి, పరిహారం, ప్రత్యామ్నాయ మార్గాలు, అధికారుల విధానాలపై పలు ప్రశ్నలు లేవనెత్తిన చాంబర్.. నేడు మాత్రం అధికారులకు సహకరిస్తామని, పట్టణ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రకటించడం వెనుక అసలు కారణమేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

నిన్న అంతటి ఆవేదన.. నేడు అంతటి సానుకూలత ఎందుకు?

మంగళవారం కథనంలో రహదారి విస్తరణకు సంబంధించి వ్యాపారుల ఆస్తులపై పడే ప్రభావం, నష్టపరిహారం, నోటీసులు, పారదర్శకత, అధికారుల బాధ్యతలపై చాంబర్ తరపున తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పట్టణ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో వ్యాపారులు నష్టపోకూడదన్నది ప్రధాన వాదనగా వినిపించింది.అయితే బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు కమల్ కిషోర్ శారద తన రాజీనామా ఆలోచనను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు అధ్యక్షుడిగా కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తొందరపాటు నిర్ణయంతో అధికారులకు ఏవైనా ఇబ్బందులు కలిగించి ఉంటే క్షమించాలని కోరడంతో పాటు, ఇకపై అధికారులకు ఇబ్బందులు కలగకుండా వారి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

మార్పు వెనుక మతలబేంటి?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. నిన్నటి వరకు అభివృద్ధి పనుల అమలులో లోపాలున్నాయంటూ ప్రశ్నించిన నాయకత్వం.. నేడు అధికారుల పట్ల క్షమాపణ ధోరణిని ఎందుకు ప్రదర్శించాల్సి వచ్చింది? రాజీనామా ఆలోచనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? ఒక్కరోజులోనే ఆ పరిస్థితులు మారిపోయాయా? లేక కమిటీ సభ్యుల అభిప్రాయమే ఈ మార్పునకు కారణమా?అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం ఆయన వ్యక్తిగత, సంస్థాగత నిర్ణయం కావచ్చు. కానీ వ్యాపారుల ప్రయోజనాల కోసం లేవనెత్తిన అసలు సమస్యలు మాత్రం ఇంకా సమాధానాల కోసం ఎదురుచూస్తున్నాయి. రాజీనామా ఉపసంహరణతో రహదారి విస్తరణపై ఉన్న సందేహాలు కూడా ఉపసంహరించుకున్నట్లేనా? అధికారులకు సహకరించడమంటే వ్యాపారుల అభ్యంతరాలను పక్కనపెట్టడమా? లేక అభివృద్ధితో పాటు వ్యాపారుల హక్కులను కాపాడేలా సమన్వయం చేసుకోవడమా? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.

అభివృద్ధికి సహకారం మంచిదే.. కానీ ప్రశ్నలకు సమాధానాలేవి?

పట్టణ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత. రహదారుల విస్తరణతో ప్రజలకు ప్రయోజనం కలగాలి. అదే సమయంలో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి ఆస్తులు, ఉపాధి, భవిష్యత్తుపైనా స్పష్టత ఉండాలి. అభివృద్ధి పేరుతో ఎవరికీ అన్యాయం జరగకూడదన్నది ప్రజాస్వామ్యబద్ధమైన డిమాండ్.చాంబర్ ఆఫ్ కామర్స్ కేవలం అధికారులతో సఖ్యతగా ఉండే సంస్థగానే కాకుండా, వ్యాపారుల సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదికగా కూడా నిలవాలి. నిన్న లేవనెత్తిన ప్రశ్నలకు నేడు కూడా అదే నిబద్ధతతో సమాధానాలు కోరాలి. అధికారులతో సమన్వయం చేసుకుంటూనే వ్యాపారుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత చాంబర్ నాయకత్వంపై ఉంది.నిన్నటి ఆవేదన నిజమా? నేటి సానుకూలతే సరైన వైఖరా? లేక ఈ రెండింటి మధ్య ఇంకా ప్రజలకు తెలియాల్సిన అంశాలేమైనా ఉన్నాయా? అన్నది కాలమే స్పష్టం చేయాలి.ఒక్కరోజులో నాయకత్వ వైఖరిలో వచ్చిన మార్పు కంటే.. రహదారి విస్తరణతో ప్రభావితమయ్యే వ్యాపారులకు న్యాయం జరుగుతుందా లేదా అన్నదే ఇప్పుడు పట్టణ ప్రజలకు ముఖ్యం. వ్యక్తుల పదవులు, రాజీనామాలు, ప్రకటనలకంటే ప్రజా ప్రయోజనాలే ప్రాధాన్యత పొందాలి. చాంబర్ నాయకత్వం మాటల్లోనే కాకుండా చేతల్లోనూ వ్యాపారుల పక్షాన నిలుస్తుందా? అన్నది రాబోయే పరిణామాలే తేల్చనున్నాయి.

కలుషిత నీరే గతి.. పట్టించుకోని యంత్రాంగం!

- పాపన్నపేట మండల వ్యాప్తంగా వాటర్ ట్యాంకుల దుస్థితి
- నెలకోసారి శుభ్రం చేయాలన్న నిబంధనలకు తూట్లు
- పాచి పట్టి, దుర్వాసన వస్తున్న తాగునీరు
- రోగాల బారిన పడుతున్నామని ప్రజల ఆందోళన



ప్రజా వాయిస్,పాపన్నపేట, పాపన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన పంచాయతీ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓవర్ హెడ్ ట్యాంకులు మినీ వాటర్ ట్యాంకులు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. నిబంధనల ప్రకారం ప్రతి నెలా విధిగా శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ, నెలలు గడుస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూసే వారే కరువయ్యారు. పాచి పట్టి.. బురద పేరుకుపోయి..మండలంలోని చాలా గ్రామాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి నెలలు గడుస్తోంది. దీంతో ట్యాంకుల లోపల గోడలకు నాచు (పాచి) పేరుకుపోయింది. అడుగుభాగంలో బురద, మట్టి మేటలు వేసి నీరు కలుషితమవుతోంది. కొన్ని చోట్ల ట్యాంకులపై మూతలు సరిగ్గా లేకపోవడంతో దుమ్ము, ధూళితో పాటు పక్షుల రెట్టలు నీటిలో కలుస్తున్నాయి. ఫలితంగా నల్లాల ద్వారా వచ్చే నీరు దుర్వాసన వస్తోందని, రంగు మారి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

అనారోగ్యం బారిన ప్రజలు

బ్లీచింగ్ పౌడర్ చల్లడం, క్లోరినేషన్ చేయడం వంటి కనీస జాగ్రత్తలు కూడా పంచాయతీ సిబ్బంది తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలుషిత మైన ఈ నీటినే తాగడం వల్ల చిన్నారులు, వృద్ధులు తరచూ జ్వరాలు, వాంతులు, విరేచనాలు, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి, అన్ని గ్రామ పంచాయతీల్లోని వాటర్ ట్యాంకులను వెంటనే శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ట్యాంకులను కడిగించి, క్లోరినేషన్ చేసేలా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆపరేషన్ థియేటర్ లేని మంథని ప్రభుత్వ ఆసుపత్రి

- కాలు విరిగినా.. చేయి విరిగినా పెద్దపల్లి, గోదావరిఖనికి పరుగులేనా?
- నిర్మాణంలోనే నూతన ఆసుపత్రి భవనం.
- ప్రజలకు అందని మెరుగైన వైద్యం
- రాజకీయ నాయకుల ఇంటి నిర్మాణాలు తొందరగా పూర్తి అవుతుంటే
- కానీ నాణ్యతలేని ప్రభుత్వ నిర్మాణాలు టీవీ సీరియల్ ల సాగుతూ ఉన్నాయి..



ప్రజా వాయిస్ మంథని స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి రాకపోవడంపై ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఎన్నికలు వస్తున్నాయి.. ప్రజాప్రతినిధులు గెలుస్తున్నారు.. పాలకులు మారుతున్నారు.. కానీ సామాన్య ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాల విషయంలో మాత్రం పరిస్థితి మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక వ్యక్తికి అకస్మాత్తుగా ప్రమాదం జరిగి కాలు విరిగినా, చేయి విరిగినా వెంటనే శస్త్రచికిత్స అవసరమైతే మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులో లేకపోవడం సమస్యగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాధితులను మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి లేదా గోదావరిఖని ఆసుపత్రులకు తరలించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. మంథనిలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ భవనం ఎప్పటికి పూర్తవుతుంది? ఎప్పుడు ప్రజలకు అందుబాటులోకి వస్తుంది? అన్నది స్పష్టత లేని ప్రశ్నగా మిగిలింది. మరోవైపు ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో అవసరమైన శస్త్రచికిత్స సదుపాయాలు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు అంటున్నారు. కాలు విరిగినా, చేయి విరిగినా స్థానికంగా వైద్యం అందక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే బాధితులు, వారి కుటుంబ సభ్యులు పడే ఇబ్బందులు ఎంత తీవ్రంగా ఉంటాయో అధికారులు ఆలోచించాలి. ముఖ్యంగా పేద కుటుంబాలకు ప్రయాణ ఖర్చులు, వైద్య ఖర్చులు అదనపు భారంగా మారుతున్నాయి. సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మంథని ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించాలి. నూతన భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, అప్పటివరకు ప్రస్తుత ఆసుపత్రిలోనూ అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలి. ఆపరేషన్ థియేటర్, వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలి.

తొలిముద్దతో ఆరోగ్యకరమైన బాల్యం

- ఉపాధ్యాయులు సంతోష, ప్రమీల

ప్రజావాయిస్/వికారాబాద్: వికారాబాద్ జిల్లా పూడూరు మండలం అంగడిచిట్టంపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గ్రామ పెద్దలు, అంగన్వాడీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తొలిముద్ద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులు సంతోష, ప్రమీల మాట్లాడుతూ చిన్నారులకు తొలి ముద్ద నుంచే పౌష్టికాహారం అందించడం ద్వారా శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందించాలని, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చిన్ననాటి నుంచే నేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగయ్య, ఉప్పర సర్పంచ్ మమత, వార్డు సభ్యులు జి. కుమార్, బి. ప్రమోద్ కుమార్, ఎం. ప్రవీణ్ కుమార్, ఎం. శ్రీకాంత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాజా, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉద్యోగాలు

- 36 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
- డిసెంబర్ 11న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల అదనపు డీఎంఈ, ప్రిన్సిపల్ డాక్టర్ దీనదయాల్ బంగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 36 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో 5 ప్రొఫెసర్, 14 అసోసియేట్ ప్రొఫెసర్, 16 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక సీఏఎస్ పోస్టు ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ పోస్టుల భర్తీకి డిసెంబర్ 11న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర పూర్తి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందవచ్చని ఆయన సూచించారు.

భద్రాద్రి కలెక్టర్ కార్యాలయంలో కామపిశాచి

- కాసేపు కళ్ళు మూసుకుంటే సరిపోతుంది అంటూ మహిళతో దుర్భాషలాడిన డి పి ఆర్ ఓ
- సాంస్కృతిక కళాకారుల బృందం వద్ద నెలసరి పైసా వసూల్.
- విధులకు హాజరైన సరే గైహాజరైనట్టు మాస్టర్లు తగ్గించిన దుర్మార్గుడు
- వేతనాల్లో కమిషన్ అడుగుతున్నట్టు కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బాధిత మహిళ





ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కామపిశాచి ఉన్నట్టు ఓ మహిళ ఆవేదన తెలపడం జిల్లాలోనే సంచలనం సృష్టిస్తుంది. భద్రాద్రి కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే పౌర సంబంధాల సమాచార అధికారి (డి పి ఆర్ ఓ) నే తన కింద పని చేసే సాంస్కృతిక కళాబృందం మహిళను లైంగికంగా వేధించడం. కాసేపు కళ్ళు మూసుకుంటే సరిపోతుంది అంటూ మహిళతో పచ్చిగా బూతులు మాట్లాడడం చూస్తే సభ్య సమాజం సిగ్గుపడే పరిస్థితి వచ్చింది. అంటూ మేధావి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. జిల్లాలో మీడియా సమన్యాయం జిల్లా కలెక్టర్, మంత్రుల, పర్యటనలు మరియు ముఖ్యమంత్రి లేదా ఇతర వివిపి ల జిల్లా పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందించే పౌర సంబంధాల సమాచార అధికారి రాసలీలలు ఒక్కసారిగా బయటపడడం జిల్లాలోనే ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాల్లోనే సంచలనం సృష్టిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పౌర సంబంధాల పరిరక్షణలో గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అవగాహన కల్పించే సిబ్బంది బృందం మహిళల వద్ద ప్రతి నెల వెయ్యి రూపాయలు వసూల్ చేస్తున్నట్లు బాధిత మహిళా జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మరి ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి. కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే పౌర సంబంధాల సమాచార అధికారి పై చట్టరీత్య చర్యలు తీసుకుంటారా!? లేదంటే. పౌర సంబంధాల అధికారిని కాపాడే ప్రయత్నం చేస్తారా!? అనేది వేచి చూడాలి మరి...

శంషాబాద్‌లో గదిలో ఉరివేసుకుని యువ కార్మికుడి మృతి

- బృందావన్ టౌన్ షిప్ లో ఘటన
- ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలేనా.?
- పోలీసుల దర్యాప్తు



ప్రజావాయిస్||శంషాబాద్: బృందావన్ టౌన్‌షిప్ కాలనీలో 22 ఏళ్ల యువ కార్మికుడు గదిలో ఉరి వేసుకుని మృతిచెందాడు.పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కుందన్ కుమార్ (22) గత రెండేళ్లుగా ఆర్జీఐ విమానాశ్రయంలో కార్మికుడిగా పనిచేస్తూ, శంషాబాద్‌లోని బృందావన్ టౌన్‌షిప్‌లో ఇద్దరు స్నేహితులతో కలిసి నివాసముంటున్నాడు.నవంబర్ 24న రాత్రి విధులు ముగించుకుని ఉదయం 6 గంటలకు గదికి చేరుకున్న కుందన్ నిద్రపోయాడు.అదే రోజు ఉదయం 9 గంటలకు అతని గదిలో ఉంటున్న నిఖిల్ కుమార్,హీరాలాల్ పనికి వెళ్లారు.రాత్రి 10.30 గంటలకు తిరిగివచ్చేసరికి గది తలుపులు మూసి ఉండటంతో పలుమార్లు తట్టినా స్పందన రాలేదు. మరుసటి రోజు ఉదయం కూడా తలుపులు తీయకపోవడంతో ఇంటి యజమాని యాదయ్యకు సమాచారం ఇచ్చి, స్థానికుల సహాయంతో తలుపులు పగుల గొట్టి లోపలికి వెళ్లారు.అక్కడ కుందన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించడంతో తాడు కోసి కిందకు దించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు.వ్యక్తిగత కారణాలు లేదా ప్రేమ వ్యవహారంలో విఫలమవడం వల్లే కుందన్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అతని రూమ్‌మేట్ నిఖిల్ ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశాడు.దీనిపై ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతికి గల కారణాలను నిర్ధారించేందుకు ఘటనాస్థలాన్ని పరిశీలిస్తూ, సాక్షుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.

జిల్లా బాస్ కి బదిలీలు లేనట్టేనా!?

- ఏళ్ల తరబడి ఒకే చోట విధి నిర్వహణ సాధ్యమేనా!
- తమ పరిధిలో ఉద్యోగస్తులకు అంతా శుభ ఘడియలేనా!?
- ప్రజల ఇబ్బందులు పడ్డాసరే అధికారులను కాపాడేది పెద్దసారైనా?
- నేటికీ యూ డి సి లేకపోయినా విధి నిర్వహణ కొనసాగింప?
- బదిలీ జరిగిన వెళ్ళనంటూ మొండికేసిన పట్టించుకోని జిల్లా కలెక్టర్!
- అసలు జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ శాఖను శాసించేది ఎవరు?



ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం స్పెషల్ స్టోరీ!?
సాధారణంగా ప్రభుత్వం శాఖల్లో మూడు సంవత్సరాలు ఒకే చోట విధి నిర్వహణలో కొనసాగిస్తే అంతులేని అవినీతికి పాల్పడతారని సదా ఉద్దేశంతో ప్రభుత్వం బదిలీలు చేయడం సర్వసాధారణమే కానీ ఒక శాఖలో మాత్రం ఏళ్ల తరబడి ఒకే చోట జిల్లా అధికారిగా శాసిస్తూ మండల స్థాయిలో ఉన్న అధికారులను కాపాడుతూ వారి నుంచి వచ్చే ముడువులకు బానిసై బదిలీలు ఉన్నప్పటికీ వేరేచోటకు వెళ్లలేక ఇష్టం లేక జిల్లా బాస్ అయిన కలెక్టర్ ను సైతం ఎదిరించి జిల్లాలోని పలు ఆరోగ్య కార్యాలయాలను శాసిస్తూ అధికారులకు నచ్చిన రీతిలో సెలవులు మరియు ప్రమోషన్లు మరియు బదిలీలు ఇస్తూ వారి మన్నెల పొందడం ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ సంచలనంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా జిల్లాగా ఏర్పడిన భద్రాద్రి జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విభాగానికి ఓ జిల్లా అధికారి గత 13 సంవత్సరాల నుండి దిష్టి వేసి బదిలీలు ఉన్న వెళ్లకుండా తమ పరిధిలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విభాగాలలో కొందరు అధికారులను వారికి నచ్చిన రీతిలో నడిచేందుకు అన్ని సహకారాలు అందించడమే కాకుండా వారికి వివిధ రకాల ప్రమోషన్లు సెలవులు తో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను సైతం వారికి అందించటం వారు మెప్పు పొందటం వంటి గత 12 సంవత్సరాలుగా ఇదే తంతు కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

విధి నిర్వహణలో లోపాలు జరిగిన వారికి మెప్పే!

జిల్లా బాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లే కాకుండా జిల్లా హెడ్ క్వార్టర్ నందు శిశు సంరక్షణ కేంద్రాలు సైతం తమ పరిధిలోకి వస్తాయన్నది నగ్న సత్యం అటువంటి వాటిలో పనిచేస్తున్న అధికారులు సైతం ఎప్పుడైనా ఎక్కడైనా విధి నిర్వహణలో లోపాలు జరిగిన సమర్థించి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు జిల్లా బాస్ అనేక విష ప్రయత్నాలు కొనసాగించడమే కాకుండా వారిని కాపాడే ప్రయత్నం చేయటం కొసమెరుపు అంతే కాకుండా బాస్ కనుసైగల్లోనే సెలవులు లో ఉన్న ఉద్యోగస్తులు విధి నిర్వహణలో లేకపోయినా వారికి అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో జిల్లా బాస్ సహకరిస్తున్నట్లు సాక్షాత్తు ప్రభుత్వ ఉద్యోగులే మీడియాకు చెబుతున్న మాట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు యూ డి సి లేకపోయినా విధి నిర్వహణలో కొనసాగినట్లే!?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని ప్రభుత్వ ప్రాథమిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లకు ప్రస్తుతానికి యూ డి సి అధికారి లేనట్లే తెలుస్తోంది అటువంటి ఉద్యోగిని ప్రస్తుతం జిల్లా కేంద్రానికి అయిన బాస్ పద్దనే విధులు నిర్వహిస్తున్నారు తప్ప వారి కార్యచరణాలు మాత్రం మండలాల్లో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కార్యాలయంలో మాత్రం విధి నిర్వహణలో కొనసాగమని తెలుస్తుంది ఎందుకంటే గతంలో పనిచేసిన ఓ అధికారిని ప్రభుత్వం యు డి సి విభాగాన్ని (డి హెచ్ ఓ)జిల్లా హెల్త్ ఆఫీసర్ విభాగంలోని విధి నిర్వహణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందో లేదో గాని వారి మనుగుడు మాత్రం వివిధ మండలాలకి కనుమరుగైందని చెప్పుకోవచ్చు.

జిల్లా బాస్ కి బదిలీ ఉన్నట్టా లేనట్లా!?

జిల్లాలోని వివిధ రకాల విభాగాలకు సంబంధించిన జిల్లా యంత్రాంగం అనేకమంది బదిలీలు అయి వేరే ప్రాంతానికి వెళ్లి విధి నిర్వాలను కొనసాగించటం జరుగుతూనే ఉంది కానీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విభాగానికి మాత్రం ఆ జిల్లా బాస్ గత 12 సంవత్సరాలుగా విధి నిర్వహణలో జిల్లా కి మాత్రమే పరిమితమయ్యాయి తప్ప వేరే ప్రాంతానికి బదిలీ అయిన దాఖలాలు లేవని తెలుస్తుంది అంతేకాకుండా సార్ కి బదిలీ అయిన కొందరు రాజకీయ నాయకులతో ఒప్పందాలను కుదుర్చుకొని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విభాగంలో కొన్ని రకాల ఒప్పందాల పనుల గురించి వారి వేరే ప్రాంతానికి బదిలీ కాకుండా కొత్తగూడం జిల్లాకే పరిమితమయ్యాయ్ నట్లు విశ్వసనీయ సమాచారం ఏది ఏమైనా సార్ వారు బదిలీ కాక పోవడం పై మరెన్నో సమాచారం ప్రజా వాయిస్ మీ ముందుకు తీసుకువస్తుంది. మరో రోజు కథనంతో!



కాశిబుగ్గలో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ

- మురుగు నీటితో కలుషితం!
- రెండు నెలలుగా పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదులు చేసినా స్పందన కరువు!
- ఒకవైపు నీటి పొదుపుపై ప్రచారం
- మరోవైపు వృథాగా పారుతున్న మంచినీరు!
- అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం!
- మంచినీటిలో మురుగునీరు.. ప్రజారోగ్యంతో చెలగాటమా?

ప్రజా వాయిస్ హైదరాబాద్ వరంగల్ నగరంలోని కాశిబుగ్గ శ్మశానవాటిక సమీపంలో మంచినీటి పైపులైన్ లీకేజీ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. పైపులైన్ నుంచి మంచినీరు లీకవుతూ పక్కనే ఉన్న మురుగునీటితో కలిసిపోతుండటంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే నీటి సరఫరా సరిగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతుండగా, పైపులైన్ లీకేజీ సమస్య మరింత ఆందోళనకు గురిచేస్తోంది.ఈ సమస్యపై స్థానికులు గత రెండు నెలలుగా సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన తాగునీటి సమస్యపై ఇంత నిర్లక్ష్యమా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఒకవైపు ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని ప్రభుత్వం ప్రచారం చేస్తుంటే.. మరోవైపు విలువైన మంచినీరు పైపులైన్ లీకేజీతో వృథాగా మురుగులో కలుస్తున్నా అధికారులకు కనిపించడం లేదా అని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజలు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికార యంత్రాంగం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని తక్షణమే అరికట్టి, పైపులైన్‌ను మరమ్మతు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కాశిబుగ్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తేజశ్రీకి న్యాయం ఎప్పుడు..?

- మూడో రోజుకు చేరిన నిరాహార దీక్ష' ఆరోగ్యం విషమం
- దీక్ష విరమించకుండానే బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు
- కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ నుంచి డి.ఆర్.డి.ఓ, అపోలో ఆసుపత్రికి తరలింపు
- తేజశ్రీకి అండగా నిలిచిన బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి
- గవర్నర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని ఎమ్మెల్సీ హామీ

ప్రజావాయిస్|| రాజేంద్రనగర్:మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ న్యాయం కోసం చేస్తున్న పోరాటం ఉత్కంఠ రేపుతోంది. న్యాయం కోరుతూ ఆమె చేపట్టిన నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకోగా, ఆరోగ్యం క్షీణించడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.అయినప్పటికీ పోలీసులు ఆమెను బలవంతంగా అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అక్కడ ఆరోగ్యం మరింత క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం డి.ఆర్.డి.ఓ అపోలో ఆసుపత్రికి తరలించారు.ఈ విషయం తెలుసుకున్న బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి తేజశ్రీని పరామర్శించారు.ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ అంశాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి బాధితురాలికి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.మరోవైపు డాక్టర్ సల్లా సౌజన్య,ప్రశాంత్, రాజ్‌కుమార్,కమలాహార్ తదితరులు ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తేజశ్రీ సమస్యను పరిష్కరించాలని,ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.తేజశ్రీకి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.





శివాలయం వెనుక మద్యం సీసాలు

- అర్ధరాత్రి తాగుబోతుల జల్సాలు
- కార్తీక పౌర్ణమి వేళ భక్తితో వెలిగిన దీపాలు
- అర్ధరాత్రి అపవిత్రంగా మారిన ఆలయ పరిసరాలు
- మహాపాపం అన్న భక్తులు, ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు
- కఠినంగా శిక్షించాలని కోరుతున్న ప్రజలు,

ప్రజావాయిస్, కీసర : కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో శివనామస్మరణ చేస్తూ దీపాలు వెలిగించిన పవిత్ర ఆలయ ప్రాంగణం వెనుక మద్యం ఖాళీ సీసాలు దర్శనమివ్వడం భక్తులను కలచివేస్తోంది. మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారం గ్రామంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భక్తిపారవశ్యంతో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం కూడా చేశారు . అయితే అదే రోజు అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ ప్రాంగణంలో మద్యం సేవించి ఖాళీ సీసాలను ఆలయం వెనుక భాగంలో వదిలేసి వెళ్లినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు భక్తులు పవిత్రంగా భావించి పూజలు నిర్వహించే ఆలయ పరిసరాల్లో మరోవైపు మద్యం సీసాలు పడివుండటం తీవ్ర అభ్యంతరకరంగా మారింది. దేవాలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భక్తులు పేర్కొంటున్నారు.ఆలయాలు భక్తికి నిలయాలు.. మద్యం సేవించే ప్రదేశాలు కావు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ఆలయ పరిసరాల్లో నిఘా పెంచి పరిశుభ్రతను కాపాడాలని గ్రామస్తులు, భక్తులు సంబంధిత అధికారులను పోలీసులను కోరుతున్నారు. గతంలో ఇదే ఆలయంలో గర్భగుడిలోకి ప్రవేశించి స్వామివారి నాగపడిగే తదితర పూజ సామగ్రి లు చోరీకి గురయ్యాయి....

మల్లన్న సాగర్ చెంతనే ఉన్నా.. రైతు పంటకు అందని సాగునీరు

- రెండెకరాల్లో తొమ్మిది బోర్లు వేసినా ఫలితం శూన్యం
- ఎండిపోయిన వరి పంట పశువుల మేతగా మారిన వైనం

ప్రజా వాయిస్ / దుబ్బాక: ఒకవైపు చెరువులు, కుంటలు ఎండిపోవడం.. మరోవైపు బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కళ్లముందే పంట ఎండిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. తలాపునే మల్లన్న సాగర్ జలాశయం ఉన్నప్పటికీ సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటం రైతుల దుస్థితికి అద్దం పడుతోంది.దుబ్బాక పట్టణ పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన ఇస్తారిగాళ్ల నర్సింలు తనకున్న రెండెకరాల భూమిలో ఎన్నో ఆశలతో సన్న వరి పంట సాగు చేశాడు. ఇప్పటికే సుమారు రూ.60 వేల పెట్టుబడి పెట్టాడు. సన్న వడ్లకు మంచి ధర లభిస్తుందనే ఆశతో పంట సాగు చేయగా, బోర్లలో నీటి ఊటలు తగ్గిపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. పంట చేతికొచ్చే సమయంలో సాగునీరు లేక వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు.పంటను కాపాడుకునేందుకు చుట్టుపక్కల ఉన్న బోర్ల నుంచి నీటిని తీసుకురావాలని ప్రయత్నించినా, అక్కడ కూడా నీరు లేకపోవడంతో నిరాశే ఎదురైంది. చివరకు ఎండిపోయిన వరి పంటను పశువులకు మేతగా వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ఆరేళ్లుగా సుమారు రూ.13 లక్షలు ఖర్చు చేసి తొమ్మిది బోర్లు వేసినా చుక్క నీరు దొరకలేదని నర్సింలు ఆవేదన వ్యక్తం చేశాడు. బోర్ల కోసం చేసిన అప్పులు తీరకపోగా, అప్పుల వాళ్ల ఒత్తిడి పెరుగుతోందని కన్నీటిపర్యంతమయ్యాడు.తలాపునే మల్లన్న సాగర్ జలాశయం ఉన్నప్పటికీ స్థానిక చెరువులు, కుంటలకు నీటిని నింపకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని రైతు వాపోయాడు. చెరువులు, కుంటలను నింపితే భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు చేరుతుందని, తద్వారా పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండదని పేర్కొన్నాడు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మల్లన్న సాగర్ నీటిని స్థానిక చెరువులు, కుంటలకు విడుదల చేయడంతో పాటు తనలాంటి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నర్సింలు విజ్ఞప్తి చేస్తున్నాడు.







వికారాబాద్ లో ఘోర ప్రమాదం

- వ్యక్తి తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి!
- మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజావాయిస్/వికారాబాద్: పట్టణంలో టిప్పర్ లారీ ప్రమాదం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాయత్రి జ్యువెలరీ షాప్ ఎదుట చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాజ గౌడ్ (50) అనే వ్యక్తి గాయత్రి జ్యువెలరీ షాప్ ఎదుట ఉండగా, టీజీ 07 ఎక్స్ 1188 నంబర్ గల టిప్పర్ లారీ అతని తలపై నుంచి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన రాజ గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.



పోతారం గ్రామ లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు

- మంథనిలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పటేల్

ప్రజా వాయిస్ మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మంథనిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల ఆదిత్య, ఉపసర్పంచ్ దాసరి వెంకటస్వామి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందడంతో వారు ప్రయోజనం పొందనున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దాసరి సతీష్, బొగిరి స్రవంతి, దాసరి ఈశ్వరి, దేనవేన కుమారస్వామి, తుండ్ల లక్షి , తుండ్ల వైష్ణవి, ఇసంపెల్లి బాపు, పంచాయతీ కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.



ధాన్యం రోడ్డుపాలైంది.. మానవత్వం మౌనమైంది!

చేవెళ్ల (ప్రజావాయిస్):ఆరుగాలం శ్రమించి అన్నం పండించే రైతు.. తన పంటను కాపాడుకోవడానికి నడిరోడ్డుపై నిస్సహాయంగా నిలబడాల్సి వచ్చింది. బుధవారం చేవెళ్ల చౌరస్తా వద్ద లారీ తాకిడితో ట్రాక్టర్‌లోని వడ్ల సంచులు కిందపడటంతో ధాన్యమంతా రోడ్డుపాలైంది. ఒక్కో గింజను ఏరుకుంటూ రైతు సాయం కోసం ఎదురుచూసినా.. ఆగి చేయూతనిచ్చే చేతులు,పోలీస్ పెట్రోల్ వాహనాలు కరువయ్యాయి. ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు.మన కంచంలో అన్నం మెతుకుగా చేరే ముందు.. రైతు జీవితంలో చెమట చుక్కగా మొదలవుతుంది. ఆ విలువ తెలిసిన సమాజం.. ఆ రైతు కష్టం కళ్లముందు పడితే మాత్రం ఎందుకు స్పందించదు? ధాన్యం ఏరుకున్నది రైతే.. కానీ ఈ ఘటన సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది!



ఇందిరమ్మ జీవిత బీమా పథకంతో ఆర్థిక ధీమా

- గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం

ప్రజా వాయిస్/మర్వల్లి:మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని బుధవారం ఎంపీడీవో శాంత గ్రామ సర్పంచ్ రాజు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు జీవిత బీమాపై భరోసా కల్పించడం, ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక రక్షణ అందించడం వంటి లక్ష్యాలతో ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

14వ వార్డులో వీధి కుక్కల స్వైరవిహారం.. జనం బెంబేలు!

- గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న శునకాలు
- చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్న వైనం
- మున్సిపల్ చైర్ పర్సన్ , కమిషనర్ , కౌన్సిలర్ తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి



ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్

నియోజకవర్గం :గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎప్పుడు ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయోనన్న భయంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వెళ్లే వృద్ధులకు వీధి కుక్కలతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. కుక్కల గుంపులు రహదారులపై సంచరిస్తుండటంతో పిల్లలను ఒంటరిగా బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని చెబుతున్నారు. ఈ సమస్యతో సాధారణ రాకపోకలకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి కుక్కల బెడదకు అడ్డుకట్ట వేయాలని 14వ వార్డు ప్రజలు కోరుతున్నారు. స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి కుక్కల నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

పగలు రాత్రి తేడా లేకుండా
అక్రమంగా మట్టి,ఇసుక రవాణ

- పోలీస్ స్టేషన్ కి తరలించిన వాహనాలు నిమిషాల్లో, ఒక రోజులో బయటకు
- ఇసుక వెల్ది,వేగురుపల్లి, ఊటూర్ నుండి తరలిస్తుంటే
- మట్టి గట్టుదుద్దేనపల్లి, పొలంపల్లి నుండి రాత్రుళ్ళు తరలిస్తున్నారు.
- సహజ వనరులు ఏవైనా లక్ష్యం ఒక్కటే ఈ రెండు మాఫియా గ్రూపులకు
- పోలీసులకు మామూళ్లు ఇస్తున్నామని పెట్రేగిపోతున్న కొందరు
- పెట్రోలింగ్ కానిస్టేబుల్ దాడి విషయంలో సీ.పీ ఆదేశాలతో కేస్ ఫైల్
- అసలు అక్రమంగా సహజ వనరుల దోపిడిని ఆపకుండా ఆజ్యం పోస్తున్నదేవరు..?
- సి సి కెమెరాలు పరిశీలిస్తే విషయాలన్నీ అవగతం అవుతాయనే ఆరోపణలు ఉన్నాయి





ప్రజా వాయిస్, కరీంనగర్ బ్యూరో(నవంబర్ 25):కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల వ్యాప్తంగా జోరుగా అక్రమ మట్టి, ఇసుక రవాణ జోరుగా సాగుతున్న అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. మన ఇసుక వాహనం ద్వారా అనుమతులతో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లు కొన్నైతే వెల్ది, వేగురుపల్లి, ఊటూర్ నుండి అక్రమార్కులు ఇదే అదనుగా కరీంనగర్, తిమ్మాపూర్ లాంటి ప్రాంతాలకు దొంగ ఇసుక రవాణ చేస్తు ప్రభుత్వం ఆదాయానికి గండి కొడుతూ సహజ వనరుల దోపిడితో హంగుఆర్భాటలతో విలాసవంతమైన జీవితం గడుపుతున్న న్యాయ వ్యవస్థ మాత్రం తనకెం పట్టదన్నట్టుగా వ్యవహరించండం సిగ్గుచేటు.. మండలంలోని గట్టుదుద్దేనపల్లి పొలంపల్లి శివారులో జాతీయ రహదారి కోసం తీసిన మట్టి గుట్టల్లో నుండి కొందరు జేసీబీ లు, లారీలు పెట్టుకుని రాత్రుళ్ళులని లెక్కలేకుండా మట్టిని శంకరపట్నం, హుజురాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు తరలిస్తున్న ఎక్కడిక్కడ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా దర్జాగ ఉండటంతో సమస్యను ఎవరికి చెప్పాలో కూడా ప్రజలకు తెలియని స్థితిలో ఉండిపోతుండటం కోసం మెరుపు. కొందరు ప్రజలు చరవాణిలో పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ పోలీస్ స్టేషన్స్ కి తరలించిన లారీ టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లు వదిలేయడంతో అసలు అధికారులు ఎవ్వరికీ కొమ్ముకాస్తున్నారు..? చర్యలు తీసుకోవడంలో ఎందుకు విఫలమవుతున్నారు.?TG02T0924, TS02UV1402 ఇసుక ట్రాక్టర్లు 19 నవంబర్ రోజున పోలీస్ స్టేషన్ తరలించి 20 రోజున వదిలేయడం జరిగిందని అసలు ఎం జరిగుంటుందనే ప్రశ్నలు ప్రజల్లో మరియు దొంగ ఇసుక రవాణ చేసే గ్రూపుల్లో చర్చనీయాంశంగా మారింది. అలాగే నవంబర్ 8 రోజున ఒక మట్టి లారీ టిప్పర్ ని కానిస్టేబుల్ ఈదుల గట్టెపల్లి భారత్ ఫిల్లింగ్ స్టేషన్ దగ్గర ఆపి వివరాలు అడిగి తెలుసుకునే సమయంలో మరియు పోలీస్ స్టేషన్ కి తరలిస్తున్న ప్పుడు ఫొటోలో తీసిన ప్రజా వాయిస్ రిపోర్టర్ సీ.ఐ కి చరవాణిలో సమాచారం ఇచ్చినప్పటికి అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని నిమిషాల వ్యవధిలో వదిలేయడంతో సీ ఐ వ్యహరించిన తీరుపై అనేక అనుమానాలకు దారి తీస్తుందని చెప్పాలి.

అక్రమ ఇసుక, మట్టి రవాణ వాహనాలను పట్టుకోవడం, వదిలేయడం ఎందుకు..?

మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక మట్టి సహజ వనరుల దోపిడీ జరుగుతుందనే ముచ్చట జగమేరిగిన సత్యం మరెందుకు చర్యలు తీసుకోవడంలో పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు వెనకడుగు వేస్తున్నారు. జరుగుతున్న విషయం పూర్తిగా అక్రమ దందా మాఫియా చేతుల్లోనే విషయమని, దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్న ఆయా గ్రామాల్లో గతంలో అనేక రకాలుగా ప్రజలు దుమ్ము, ట్రాక్టర్లు–లారీల శబ్దాలు, సమాచారం ఇస్తే దాడులు ఎదుర్కొంటున్న తీరుపై భయపడి ఉరుకుంటున్న తీరు అధికారులకు కల్పిత రువుగా మారిందని కోణంలో ఈ వ్యవహారం ముందు వెళ్తుంది.

మామూళ్లు ఇస్తున్నామంటూ పెట్రేగిపోతున్నరు..

మానకొండూర్ పోలీసుల తీరు దారుణంగా మారిందని చెప్పాలి. ఉన్నతాధికారులు దృష్టిసారించి. అసలేం జరుగుతుందనే పద్ధతిలో విచారణలు చేస్తే స్టేషన్లో సి.సి కెమెరాలు తనిఖీలు చేస్తే తప్ప ఈ పరిస్థితితులు మారవనే వినికిడి బలంగా వస్తుంది. పోలీసులకు మామూళ్లు ఇస్తున్నామని కొందరు జేసీబీ,ఇసుక ట్రాక్టర్, లారీల యజమానులు అక్కడక్కడ పెట్రేగిపోతున్నారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు వాపోతున్నారు. ఇసుక రవాణ తో వాగులో నీటిమట్టం తగ్గి వ్యవసాయం మిద ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు గుట్టలు గుల్లవడంతో రాత్రుళ్ళు గుట్టల నుండి జంతువులు వస్తున్నాయని ఆ ప్రాంతాల ప్రజలు అంటున్నారు చూడాలి మరి అధికారులు ఎం చర్యలు తీసుకుంటారో....

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతాం

- సైబర్ నేరాలు, దొంగతనాల నియంత్రణకు ప్రాధాన్యం
- టూ టౌన్ సీఐ ఎ. రంజిత్ రెడ్డి



ప్రజా వాయిస్ | మిర్యాలగూడ: ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో మిర్యాలగూడ పట్టణంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తానని టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ ఎ. రంజిత్ రెడ్డి తెలిపారు.టూ టౌన్ సీఐ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం జిల్లాలోనే ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఉండటంతో పాటు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతంగా విస్తరించి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు మనీ రికవరీ మాడ్యూల్ (ఎంఆర్ఎం) ద్వారా నగదును తిరిగి ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, బాలికలపై వేధింపులను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రతి కాలనీ, వ్యాపార సముదాయంలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని, గంజాయి విక్రయాలు, అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి వెల్లడించారు



నేరాలకు స్వస్తి పలకాలి.. లేదంటే కఠిన చర్యలు తప్పవు

- రౌడీషీటర్లకు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ హెచ్చరిక
- నగర బహిష్కరణతో పాటు పీడీ యాక్ట్ అమలుకు సిఫారసు చేస్తామని స్పష్టం

ప్రజా వాయిస్ గోదావరిఖని నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో జీవించకపోతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రవర్తన మార్చుకోని వారిపై నగర బహిష్కరణతో పాటు పీడీ యాక్ట్ అమలుకు సిఫారసు చేస్తామని స్పష్టం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఏసీపీ ఎం.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ నేర ప్రవృత్తిని పూర్తిగా మార్చుకొని చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, పౌర వివాదాల్లో జోక్యం చేసుకోవడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాలనే జీవన విధానంగా మార్చుకొని విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఇప్పటికైనా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి కుటుంబంతో కలిసి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని హితవు పలికారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై పోలీసుల చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఏసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్సైలు మనోహర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.







పాడి పశువుల సంతతి పెంపునకు సరికొత్త అడుగు

- రాజేంద్రనగర్ లో ఆధునిక పిండ మార్పిడి సాంకేతికత
- సాహివాల్,దేవని,ఒంగోలు జాతుల 13 ఆవులకు సంకర పిండాల బదిలీ

ఆడ దూడల జనన అవకాశాల పెంపునకు ప్రత్యేక సాంకేతికత వినియోగం

- పశుసంపద అభివృద్ధి, విద్యార్థుల పరిశోధనకు దోహదం

ప్రజావాయిస్||రాజేంద్రనగర్:పాడి పశువుల జన్యు నాణ్యతను పెంచడంతో పాటు ఉత్తమ సంతతిని అభివృద్ధి చేసే దిశగా రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల కీలక కార్యక్రమం చేపట్టింది.పీవీ నరసింహా రావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలోని పశుక్షేత్ర సముదాయ విభాగం(ఎల్ఎఫ్సీ) ఆధ్వర్యంలో ఆధునిక పిండ మార్పిడి సాంకేతికతను అమలు చేసింది.ఇందులో భాగంగా సాహివాల్,దేవని, ఒంగోలు జాతులకు చెందిన 13 ఆవులకు హోల్‌స్టీన్ ఫ్రీసియన్–సాహివాల్ సంకర పిండాలను బదిలీ చేశారు.జన్యుపరంగా ఉత్తమమైన దాత ఆవుల అండాలను ఎంపిక చేసిన ఆంబోతుల లింగ విభజిత వీర్యంతో ప్రయోగశాలలో ఫలదీకరించి,ఏడు రోజుల పాటు అభివృద్ధి చేసిన నాణ్యమైన పిండాలను గ్రహీత ఆవులకు బదిలీ చేశారు.ఈ పిండాలను పాలమూరు బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఉత్పత్తి చేసింది.గర్భధారణ విజయవంతమైతే సుమారు 280 రోజుల తర్వాత సంకర జాతి దూడలు జన్మించే అవకాశం ఉంది.ఈ సాంకేతికత ద్వారా ఉత్తమ జన్యు లక్షణాలున్న పాడి పశువుల సంతతిని తక్కువ సమయంలో ఎక్కువ సంఖ్యలో అభివృద్ధి చేయవచ్చు.భవిష్యత్తులో దూడల పెరుగుదల,పాల దిగుబడి,గర్భధారణ ఫలితాలను పరిశీలించడం ద్వారా పశు సంపద అభివృద్ధికి ఉపయోగకరమైన సమాచారం సేకరించనున్నారు.సీనియర్ ప్రొఫెసర్, విశ్వవిద్యాలయ విభాగాధిపతి డాక్టర్ టి. రఘునందన్,ప్రొఫెసర్లు డాక్టర్ పి.అమరేశ్వరి,డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ ప్రక్రియ ద్వారా పశువైద్య విద్యార్థులకు ఆధునిక పునరుత్పత్తి సాంకేతికతలపై ప్రత్యక్ష అవగాహన,పరిశోధనకు అవకాశం లభించింది.

పీసీపీఎన్‌డీటీ చట్టం అమలులో నిర్లక్ష్యం వహించరాదు

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు

పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రజా వాయిస్ మహబూబాబాద్

ఆడ, మగ శిశువుల నిష్పత్తిలో సమతుల్యతను కాపాడుతూ, ఆడ శిశువుల పట్ల వివక్షను నివారించేందుకు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు, లింగ ఎంపికకు పాల్పడే చర్యలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రీ-కన్సెప్షన్ అండ్ ప్రీ-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌లి సంబంధిత అధికారులను ఆదేశించారు.పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు, జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణ, అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టడం, చట్ట ఉల్లంఘనలకు పాల్పడే వారిపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో ఆడపిల్లలు, మగపిల్లలు సమానమేనని, ఆడ శిశువుల పట్ల వివక్ష చూపే ఆలోచనా విధానాన్ని తొలగించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం, లింగ ఎంపిక కోసం పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వైద్యులు, స్కానింగ్ కేంద్రాలు, ఇతర వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో నిర్వహిస్తున్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, సంబంధిత వైద్య సంస్థలు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయా లేదా అన్న అంశంపై అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పనిసరిగా చట్ట ప్రకారం నమోదు చేసుకుని, రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటిస్తూ, అనుమతించిన సేవలకే పరిమితమై పనిచేయాలని స్పష్టం చేశారు. నమోదు కాని కేంద్రాలు, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన రికార్డులు, ఫారమ్‌లు, రిజిస్టర్లు, రోగుల వివరాలు, పరీక్షల ఉద్దేశ్యం తదితర అంశాలను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. రికార్డుల నిర్వహణలో లోపాలు, తప్పుడు వివరాలు నమోదు చేయడం, చట్ట నిబంధనలను ఉల్లంఘించడం వంటి అంశాలను గుర్తించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత



అధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలను కేవలం నామమాత్రంగా కాకుండా బాధ్యతాయుతంగా, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని తెలిపారు.పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం గర్భస్థ శిశువు లింగాన్ని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించడం, లింగాన్ని వెల్లడించడం, లింగ ఎంపికకు సంబంధించిన ప్రక్రియలకు సహకరించడం నిషేధమని, ఈ విషయంపై వైద్యులు, సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. చట్టంలోని నిబంధనలు, శిక్షలు, వైద్య సంస్థల బాధ్యతలు, నమోదు ప్రక్రియలు, రికార్డుల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఆడ శిశువుల పట్ల వివక్షకు దారితీసే సామాజిక ఆలోచనా విధానాలను మార్చేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆడపిల్లల జననం పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించేలా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళా సంఘాలు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర సంబంధిత విభాగాల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆడపిల్లల హక్కులు, వారి విద్య, ఆరోగ్యం, భద్రత, సమాన అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని పేర్కొన్నారు.జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలును పర్యవేక్షించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలపై సమాచారం అందిన వెంటనే స్పందించాలని, నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు, అవగాహన కార్యక్రమాల ద్వారా చట్ట అమలును మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులకు సూచించారు.ఆడ శిశువుల రక్షణ, మహిళల గౌరవం, సమానత్వ భావన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా వ్యాప్తంగా బాలికల రక్షణ, మహిళల భద్రత, చట్టాల అమలుపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో బాల్యవివాహాల నివారణ, యువతులు, బాలికలు అక్రమంగా లేదా అనాలోచిత గర్భధారణలకు గురికాకుండా అవగాహన కల్పించడం, మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణ, చట్టవిరుద్ధ చర్యలను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, సామాజిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తును దెబ్బతీయడమే కాకుండా వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, విద్యకు ఆటంకం కలిగించి, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడే పరిస్థితులకు దారితీస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, కార్యక్రమాలపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికల వయస్సు, విద్య, ఆరోగ్య పరిస్థితులపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తూ బాల్యవివాహాలను ప్రోత్సహించే ధోరణులను అరికట్టాలని అధికారులకు సూచించారు.బాల్యవివాహాల నిరోధక చట్టం (ప్రోహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్) ప్రకారం బాల్యవివాహాలు నిర్వహించడం, ప్రోత్సహించడం, వాటికి సహకరించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి ఘటనలు ఎక్కడైనా చోటుచేసుకుంటే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బాల్యవివాహాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే గ్రామస్థాయి అధికారులు, పోలీసు శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని వివాహాలను అడ్డుకోవాలని తెలిపారు. బాలికలకు అండగా నిలిచి, వారి హక్కులను కాపాడే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.యువతులు, బాలికలు అనాలోచిత గర్భధారణలకు గురయ్యే పరిస్థితులను నివారించేందుకు ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కౌమార దశలో శారీరక, మానసిక ఆరోగ్యంపై సరైన అవగాహన లేకపోవడం, కుటుంబాల్లో తగిన చర్చలు జరగకపోవడం, సామాజిక ఒత్తిళ్లు, బాల్యవివాహాలు తదితర కారణాల వల్ల బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, మహిళా సంఘాల సమావేశాల ద్వారా కౌమార ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత, హక్కులు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించాలన్నారు.బాలికలు, యువతులకు వైద్యపరమైన సమాచారం, కౌన్సెలింగ్, అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భధారణకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు బాధితులను అవమానించడం, వివక్ష చూపడం కాకుండా వారికి అవసరమైన వైద్య సహాయం, మానసిక ధైర్యం, గోప్యతతో కూడిన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు, బలవంతపు సంబంధాలు, ఇతర చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించిన ఘటనల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా బాధితులకు తక్షణ రక్షణ కల్పిస్తూ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు బాలికల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించే విధంగా బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాలికలు చదువును మధ్యలో నిలిపివేయకుండా, విద్య కొనసాగించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, పాఠశాలలు, కళాశాలల్లో బాలికల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.బాల్యవివాహాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ అన్నారు. బాలికలకు విద్యను అందించడం, వారి అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం, చిన్న వయస్సులో వివాహాలు చేయకుండా చూడడం ప్రతి కుటుంబం బాధ్యతగా తీసుకోవాలన్నారు. బాలికల భవిష్యత్తును కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల్యవివాహాలు, బాలికలపై వేధింపులు, అక్రమ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు చైతన్యవంతులై ముందుకు రావాలని తెలిపారు..జిల్లాలో బాలికల రక్షణ, మహిళల భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, కౌమార ఆరోగ్య పరిరక్షణకు సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులకు ఆదేశించారు.బాలికల హక్కులను పరిరక్షిస్తూ, బాల్యవివాహాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.స్కానింగ్ సెంటర్లు, ఫార్మసీ, హాస్పిటల్స్ లలో ప్రత్యేక బృందాల చేత ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా సంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆర్ఎంపీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, మరిపెడ, డోర్నకల్, మల్యాల, కేసముద్రంలో ప్రత్యేక నిగా పెట్టాలని సూచించారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పి.డి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ బి శ్రీనివాస్, ఆర్ఎంఓ ఐఎంఓ ప్రెసిడెంట్ డాక్టర్ జగదీష్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి. కరుణాకర్, ప్రోగ్రామ్ అధికారి జి. విరాజిత, తదితరులు పాల్గొన్నారు.



రాబోయేపరీక్షల్లో విద్యార్థులు మెరుగైనఫలితాలుసాధించేలా ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి

కెజిబివి సందర్శించిన జిల్లా జి ఇ సి ఒ విజయలక్ష్మి

ప్రజా వాయిస్ కొత్తగూడ

జిల్లా జిఇసిఒ విజయలక్ష్మి కెజిబివి కొత్తగూడ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్, ఎస్ఎస్సి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతి, పరీక్షల సన్నద్ధత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు.అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, రాబోయే ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచనలు చేశారు.

తిరుమలలో తమిళనాడు భక్తుడు హఠాన్మరణం

కలియుగ వైకుంఠమైన తిరుమల పుణ్యక్షేత్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. తమిళనాడుకు చెందిన సదరు భక్తుడు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో తోటి భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని తంజావూరు ప్రాంతానికి చెందిన వాయల్‌రాజ్ (55) అనే వ్యక్తి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చాడు. ఈ క్రమంలో తిరుమలలోని రాంబగీచా బస్టాండ్ సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా ఆయనకు ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.అక్కడి వారు వెంటనే స్పందించి సహాయం అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. అనంతరం మృతుడి వద్ద లభించిన వివరాల ఆధారంగా ఆయనను తంజావూరు నివాసి వాయల్‌రాజ్‌గా గుర్తించారు. ఈ దుర్ఘటనపై తంజావూరులోని ఆయన కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం అందించారు. దైవ దర్శనం కోసం వచ్చి ఇలా అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవడం పట్ల భక్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ముదిరాజుల కోర్టు సమస్యలను పరిష్కరించాలి

చెరువులపై సభ్యత్వ హక్కులు కల్పించాలి

మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్

ప్రజా వాయిస్ కొత్తగూడ

వేలుబెల్లి గ్రామంలోలో పల్లె పల్లెకు మెపా కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ముదిరాజులు ఎదుర్కొంటున్న కోర్టు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, చెరువులపై ముదిరాజులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించి, మత్స్యకార సహకార సంఘాల్లో ప్రభుత్వ సభ్యత్వాలు మంజూరు చేయాలని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు.మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం, వేలుబెల్లి గ్రామంలో మెపా కొత్తగూడ మండల అధ్యక్షుడు అల్లాడి రాజు ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన 'పల్లె పల్లెకు మెపా' కార్యక్రమంలో పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక



జనాభా కలిగిన ముదిరాజులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు.ముదిరాజులలో విద్యా చైతన్యం పెంపొందించి, ఉద్యోగ సాధికారత సాధించే దిశగా మెపా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మెపాలో భాగస్వాములై సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పల్లె పల్లెకు మెపా కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ముదిరాజులను చైతన్యవంతం చేస్తూ, వారి హక్కులు, సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వేలుబెల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ముదిరాజుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ముదిరాజులు ఎదుర్కొంటున్న కోర్టు వివాదాలకు పరిష్కారం చూపడంతో పాటు, చెరువులపై వారి హక్కులను కాపాడి, అర్హులైన ముదిరాజులకు మత్స్యకార సంఘాల్లో సభ్యత్వాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మెపా కొత్తగూడ మండల అధ్యక్షుడు అల్లాడి రాజు ముదిరాజ్, గ్రామ కుల పెద్ద మనిషి కాట లక్ష్మీనారాయణ, కొక్కు సదానందం, అశోక్, కాటా లచ్చయ్య, బొల్లెబోయిన వెంకటయ్య, ఉప్పలయ్య, మల్లయ్య, ఏకాంబరం, జట్టబోయిన నరేందర్, వరంగంటి సదానందం, చెన్నబోయిన యాకయ్య, పెండ్యాల రాజ్, కొక్కు నాగరాజు, కొక్కు దేవేందర్, కాట శ్రీనివాస్ ముదిరాజ్ తదితర గ్రామ కుల పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు కల్పించాలి

MCPI(U) పార్టీ హన్మకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి

హనుమకొండ డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం

యంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా

హన్మకొండ మండలం డిప్యూటీ తాసిల్దార్ రేణుక కి వినతి పత్రం

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నివాస స్థలాలు, సొంత ఇళ్లు లేక నిరుపేదలు, నిరాశ్రయులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) హన్మకొండ జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నాయని..రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అనేక ప్రాంతాల్లో అన్యాక్రాంతమవుతున్నాయని, మరికొన్ని చోట్ల ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు అనుకూలంగా వినియోగిస్తున్నారని . ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయకుండా వేలం పాటల ద్వారా విక్రయించడం వల్ల నిరుపేదలకు తీవ్ర అన్యాయం



జరుగుతోందని .హైదరాబాద్ మియాపూర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూముల సమస్యతో పాటు వివిధ జిల్లాల్లో ప్రభుత్వ భూముల సమస్యలను పరిష్కరించి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని . వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, రంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిని పేదల నివాస అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కల్పించాల్సిన బాధ్యతను విస్మరించి ప్రభుత్వ భూములను వేలం వేయడం సరైన విధానం కాదని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని. వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, నిరుద్యోగులు, నిరుపేద కుటుంబాలకు నివాస హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు కేటాయించాలి. పేదల నివాస అవసరాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించాలి. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, రంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోని ప్రభుత్వ భూములను పేదల నివాస అవసరాలకు వినియోగించాలి. ప్రభుత్వ భూములను వేలం వేయకుండా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పేదల నివాస హక్కును కాపాడాలని, ఎన్నికల హామీలను అమలు చేసి నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని వీఙ్ఞ×(ఖ) జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున మాస్ సావిత్రి చీపురు ఓదయ్య జిల్లా కమిటీ సభ్యులు కూతురు ఇంద్రారెడ్డి, పార్టీ సభ్యులు నూతనకాంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు అన్నదాతలో ఆందోళన!

ధాన్యం చేతికొచ్చిన విక్రయించిన సర్కారు?
పంట పాలాల్లోని ధాన్యం రాశులు
ఎదురుచూస్తున్న మట్టి పూలు!
జాడ లేని జిల్లాలో ధాన్యం కేంద్రాలు!

ప్రజా వాయిస్ అన్నపురెడ్డిపల్లి

రాష్ట్రంలోని వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడమే కాకుండా తుఫాన్ హెచ్చరికలు మొదలవడంతో ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్మేయడంతో మట్టి పువ్వుల మనసుల్లో ఆందోళన మొదలైంది ఆరు నెలలు కాయ కష్టం పడి పండించిన ధాన్యం చేతికొచ్చే సమయానికి ఇటువంటి పరిణామాలు ఎదురవడంతో దిక్కుతోచని స్థితిలో రైతన్న సహాయం కోసం ఎదురుచూస్తున్న స్పందించాల్సిన సర్కార్ మాత్రం నిమ్మకనీరేనట్లు వ్యవహరిస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు అంతేకాకుండా పంట పొలాల్లో ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా ఉండటమే కాకుండా కొనే దిక్కు లేక గత కొన్ని రోజుల క్రితం పండిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న సంతోషం ఎన్ని రోజుల్లో నిలవలేదని కనీసం సర్కార్ అయిన స్పందిస్తుందా అని ఎదురుచూసిన జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు కాకుండా సివిల్ సప్లై అధికారులు సైతం స్పందించే దాఖలు లేవని తేటతెల్లమవుతుంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్నపురెడ్డిపల్లి మండలం లోని ఉన్న పలు గ్రామాలలో వరి పంటలు చివర దశలోకి రావడంతో సంతోషపడిన మట్టి పూలకు వాతావరణంలో మార్పు రావడంతో ఒక్కసారిగా గుబులు పట్టినంత పనైంది నిజానికి ఆరు నెలలు కాయ కష్టం చేసి కంటిపాపల కాపాడుకున్న పంటను తుఫాన్ సంభవించి తీవ్ర నష్టాన్ని సరిచూస్తుందా లేక సమయపాలలతో సర్కారు స్పందిస్తుందా అన్న సందేహాలతో సతమతమవుతున్నాడని మండల రైతు సంఘం నాయకులు సైతం తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండలంలోని కొందరు దళారు వ్యవస్థగా ఏర్పడి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తక్కువ ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా సర్కారు బోనస్ ను సైతం మింగేస్తున్నారని మండలంలోని రెవెన్యూ అధికారులు స్పందించాలంటూ రైతు సంఘాల నాయకులు సైతం డిమాండ్ చేస్తున్నారు గత కొన్ని



రోజులుగా దళారువేవస్తా ధాన్యాన్ని తక్కువ ధరలకు విక్రయించేందుకు అనేక రకాలుగా విష ప్రయత్నాలు కొనసాగిస్తూ ధాన్యాన్ని విక్రయించే విధానంలో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తేటతెల్లమవుతుంది అంతేకాకుండా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్దిష్ట గా పరిగణించేయడం లేదని ఏది ఏమైనా జిల్లా సివిల్ సప్లై అధికారులు స్పందించి ఇటువంటి దళారి వ్యవస్థను నిర్మూలించాలని ఇప్పటికే తెలంగాణ ధాన్యాన్ని ఆంధ్రకు తరలించే పనిలో కొందరు బడా బాబులు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఇటువంటి విధానాన్ని ప్రభుత్వం అరికట్టాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు



విద్యారంగ అభివృద్ధికై ఉద్యమాలు చేపడతాం..

యుఎస్ఎఫ్ఐ నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, హిమంత్

ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 25)::

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) నగర జిల్లా కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో 12 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అరుణ్, కార్యదర్శిగా హిమంత్ ఎన్నికయ్యారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించడం కోసం ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కమిటీ లో నగర ఉపాధ్యక్షులుగా శ్రీరామ్, మధు, శివమణి, నగర సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్, రాజు, వర్షిత్, కమిటీ సభ్యులుగా రామ్ చరణ్, మణి, ఉమామహేశ్, ప్రీతి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛందంగా వలస కాంగ్రెస్లో అలజడి!?

హామీలపై నమ్మకం లేక బీఆర్ఎస్ లో చేరిక!
పాలన విధానం నచ్చకే
తిరగబడుతున్న ప్రజానీకం?
ఒంటెద్దు పోకడ తో అధికార పార్టీ పతనం
అంటున్న గ్రామస్తులు?
2028 ఎన్నికల్లో అధికారం బిఆర్ఎస్
అంటూ భీమా వ్యక్తం!
అధికార పార్టీ హామీలు నెరవేర్చలేక డీలపడినట్లు
హేతువులు

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం

రాష్ట్రంలో అధికార పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక సతికుల పడిందని ప్రజలను నమ్మించిన ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని మండలాల్లో పలు గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా అధికార పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీ కండవాలు కప్పుకోవడం సంచలనంగా మారింది అంతేకాకుండా స్వచ్ఛందంగా ముందుకు కదిలి నాయకులు సమక్షంలో పార్టీలో చేరటం ప్రధాన నాయకులకి కొంత సంతోషకర సన్నివేశాలు కనిపించినప్పటికీ తదుపరి అధికార పార్టీ కాంగ్రెస్ తన ఉనికిని కాపాడుకునేందుకు వలస గ్రామస్తులపై కక్షపూరితమైన చర్యలు చేపడుతుందా! లేక తమ అధికార బలాన్ని చిపిస్తుందా! అన్న సందేహాలు సైతం వ్యక్తం



అవుతున్నాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం పంచాయతీ పరిధిలోని దెబ్బతోగు గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాల మేరకు బుధవారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బిఆర్ఎస్ పార్టీ కండవాను కప్పుకోవడం గ్రామంలోనే కాకుండా నియోజకవర్గం లోన సంచలన సృష్టిస్తుంది అధికార పార్టీ అయినా కాంగ్రెస్ పగ్గాలు చేతపట్టి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి బాటలు కూడా వేస్తున్నామని చెబుతున్నారే తప్ప ఎక్కడా కూడా గ్రామాల్లోని ప్రజలకు ఉపయోగపడే పనులు చేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది కేవలం వారి పనులు మరియు వాటిపై వచ్చే కమిషనర్ కి ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకునే దాఖలు లేవంటూ డబ్బతోపు గ్రామస్తులు సైతం తీవ్రంగా విమర్శించి ఇటువంటి నిర్ణయానికి శ్రీకారం చుట్టినట్టు గ్రామస్తులు మీడియా ముఖంగా తెలపడం జరిగింది.



అధికార పార్టీ గ్రామస్తులపై కన్న ప్రేమ చూపుతోందా! చవితి ప్రేమ చూపుతుందా!

ప్రస్తుతం అధికార పార్టీ కాంగ్రెస్ అనేక రకాలుగా హామీలు నెరవేరుస్తానని నమ్మబలికి ఓట్లు వేయించుకొని నేటికీ నెరవేర్చలేని పరిస్థితిలో చేతులెత్తేసిందని అందువల్లనే ఇటువంటి నిర్ణయాలకు గ్రామస్తులు తీసుకోవడం దీనిపై అధికార పార్టీ కాంగ్రెస్ వారిపై కన్న ప్రేమ చూపుతోందా లేక సవతి ప్రేమ చూపుతోందా అన్న సందేహంలో గ్రామస్తులు ఉన్నట్లు తెలుస్తుంది బుధవారం ఎంత అట్టాసంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు సమక్షంలో సుమారు 30 కుటుంబాలు పార్టీలో చేరటం శ్రేణులకు కొంత ఉత్సాహం కలిగిస్తున్న అధికార పార్టీ నాయకులకు మాత్రం జీర్ణించుకోలేని విధంగా ఉన్నట్లు విశ్వసినీయ సమాచారం ఏది ఏమైనా అధికార పార్టీ ఎలా స్పందిస్తుందో! అలాగే బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ఎలా కాపాడుకుంటారో వేచి చూడాలి మరి!

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో నవదీప్ ప్రతిభ..

ప్రజా వాయిస్, మానకొండూర్(నవంబర్ 25):

నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టి-10 క్రికెట్ టోర్నమెంట్లో కామారెడ్డి జిల్లా జట్టు రన్నరప్ కప్ సాధించడంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు వరుకోలు నవదీప్ తన ఆల్రౌండ్ ప్రదర్శనతో కీలక పాత్ర పోషించాడు. అద్భుతమైన ఆటతీరుతో జట్టు విజయానికి విశేషంగా కృషి చేసిన నవదీప్‌ను గ్రామస్థులు, క్రీడాభిమానులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



నవోదయ ప్రవేశ పరీక్షకు ముమ్మరంగా ఏర్పాట్లు

- **ఉమ్మడి మెదక్ జిల్లాలో 25 పరీక్ష కేంద్రాల ఏర్పాటు**
- **5,148 మంది అభ్యర్థుల నమోదు.. 80 సీట్లకు ఎంపిక**
- **నవంబర్ 28న ఉదయం 11.30 నుంచి పరీక్ష**
- **వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్**

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం, వర్గల్‌లో 2027--28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్షకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మొత్తం 80 సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఈ పరీక్షకు ఉమ్మడి మెదక్ జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. నవంబర్ 28న (శనివారం) ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సిద్ధిపేట జిల్లాలో 11, మెదక్ జిల్లాలో 6, సంగారెడ్డి



జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా మొత్తం 5,148 మంది అభ్యర్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణలో కీలకంగా వ్యవహరించే కేంద్రాల సూపరింటెండెంట్లు, కేంద్రస్థాయి పరిశీలకులుగా నియమితులైన సిబ్బందికి నవంబర్ 26న (గురువారం) మూడు జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. పరీక్షను పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు, బాధ్యతలపై శిక్షణలో సిబ్బందికి అధికారులు తగిన సూచనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైనప్పటి నుంచి వివిధ దశల్లో విద్యాలయానికి సహకరిస్తూ, తగిన సూచనలు అందిస్తున్న మూడు జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, వారి సిబ్బందికి నవోదయ విద్యాలయ సమితి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు దాసి రాజేందర్ పేర్కొన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రవేశ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పరీక్ష ప్రశాంతంగా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మియాపురం..

ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 25):

కరీంనగర్ మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామానికి చెందిన మియాపురం లక్ష్మణచారిని బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగింది. ఈ మేరకు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు రంగు భాస్కరాచారి, కేంద్ర ఫిలిం బోర్డ్ మెంబర్ రాపాక ప్రవీణ్, బీజేపీ మానకొండూర్ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డికి లక్ష్మణచారి కృతజ్ఞతలు తెలిపారు.

భూమి ఉన్నా..లేకున్నా ఇందిరమ్మ జీవిత బీమా నమోదు తప్పనిసరి

అర్హులైన ప్రతి కుటుంబ యజమాని పథకాన్ని
సద్వినియోగం చేసుకోవాలి
18 నుంచి 59 ఏళ్లలోపు వారు నమోదు చేసుకోవాలి:
ధూపహాడ్ సర్పంచ్ నన్నెపంగ కమలమ్మ సైదులు

పెన్ పహాడ్ / ప్రజా వాయిస్ / నవంబర్ 25

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ధూపహాడ్ గ్రామ సర్పంచ్ నన్నెపంగ కమలమ్మ సైదులు పిలుపునిచ్చారు.మండల పరిధిలోని ధూపహాడ్ గ్రామంలో సర్పంచ్ నన్నెపంగ కమలమ్మ సైదులు అధ్యక్షతన, ఉపసర్పంచ్ అర్థి నరేష్‌తో కలిసి ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. భూమి ఉన్నా, లేకున్నా ప్రతి కుటుంబ యజమాని తప్పనిసరిగా ఇందిరమ్మ జీవిత బీమాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.నమోదు కోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో కూడిన ఫోన్, నామినీ ఆధార్ కార్డు తీసుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు.కుటుంబ యజమానికి అనుకోని ఆపద ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ముఖ్యంగా నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల కుటుంబాలు ఈ పథకంపై అవగాహన పెంచుకొని నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పిన్నమనేని కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు గోపగాని సుజాత శ్రీను, చింతమల్ల నవీన్, పత్తిపాక జ్యోతి, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల మధు, ఆర్తి శోభ, ఆశా వర్కర్ చారమ్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బావనపల్లి శౌరిబాబు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభం...

సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నీరుడి వెంకటేశం...

ప్రజా వాయిస్,పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని అబ్లాపూర్ లో రూ. ఐదు లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సర్పంచ్ ల ఫోరం మండలఅధ్యక్షుడు నీరుడి వెంకటేశం బుధవారంనాడు ప్రారంభించారు. తెల్ల రేషన్ కార్డ్ కలిగి 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. అర్హులు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, నామిని ఆధార్, ఫోన్ నెంబర్ వివరాలను పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సంధ్యకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అబ్లాపూర్ గ్రామ సర్పంచ్, మరియు వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రజలు పాల్గొన్నారు





ప్రయాణికులకు బస్టాండా... ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలమా

ఎండలో. వానలో. ప్రయాణికుల ఇక్కట్లు.. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

ప్రభుత్వ ఆదాయానికి గండి... మొద్దు నిద్రలో రోడ్డు రవాణా సంస్థ అధికారులు

ప్రజా వాయిస్/ఆత్మకూరు హన్మకొండ

వివిధ ప్రాంతాలకు గమ్యం చేరేందుకు రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల కోసం ఎండకు. వానకు. ఇబ్బందులు పడకూడదని దృడ సంకల్పంతో వేల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన బస్టాండ్ నేడు ద్విచక్ర వాహనాలకు అడ్డాగా మారాయి. ములుగు రోడ్డు నుండి మంగపేట నేషనల్ హైవే 163 ఆత్మకూరు మండలం నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్టాండ్ లో ద్విచక్ర వాహనాలు ఉండడంతో ప్రయాణికులు ఎండకు. వానకు. తట్టుకోలేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వారు గమ్యానికి చేరుకుంటున్నారు దీంతో ఆర్టీసీ నష్టాల్లో కొనసాగుతుంది. ముఖ్యంగా వృద్ధులు పిల్లలకు ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్ వాహనాన్ని ఆశ్రయించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది . ఇకనైనా రోడ్డు రవాణా సంస్థ మొద్దు నిద్రను వీడి ప్రయాణికులకు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామివారికి వెండి ఆభరణాల సమర్పణ

భక్తిశ్రద్ధలతో స్వామివారికి కిలోకు పైగా వెండి ఆభరణాలు సమర్పించిన దాత పేరి శ్రీనివాస్

ప్రజావాయిస్, కీసర :

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి దమ్మాయిగూడ ఎం.వి.ఆర్ కాలనీకి చెందిన పేరి శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో వెండి ఆభరణాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఒక వెండి కిరీటం, నాలుగు వెండి చేతులను కానుకగా అందజేశారు. వీటి మొత్తం బరువు సుమారు 1 కిలో 81 గ్రాములు ఉన్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. స్వామివారిపై ఉన్న భక్తి, విశ్వాసంతో ఈ వెండి ఆభరణాలను సమర్పించినట్లు దాత తెలిపారు. ఈ సందర్భంగా దాత పేరి శ్రీనివాస్ ని ఆలయ చైర్మన్, అర్చకులు ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు..ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్మ దంపతులు, రిటైర్డ్ ఈఓ రామారావు, ఆలయ అర్చకులు రవిశర్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాటల తూటాలు.. ఆకట్టుకున్న నారాయణ 'మాస్టర్ ఓరేటర్' పోటీలు!

ఆత్మవిశ్వాసమే విద్యార్థుల అసలైన బలం.. ఘనంగా 'మాస్టర్ ఓరేటర్' కాంటెస్ట్!

నారాయణ విద్యార్థుల ప్రతిభా పాటవాలు!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ పట్టణంలోని నారాయణ హైస్కూల్ లో'మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్' (మీజ) సీజన్-7 గ్రాండ్ ఫినాలే కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. చిన్నారులు తమ అద్భుతమైన వాక్చాతుర్యంతో, వివిధ సామాజిక,సమకాలీన అంశాలపై ఇచ్చిన స్పష్టమైన ప్రసంగాలతో ఆహూతులను ఆకట్టుకున్నారు.ధైర్యంగా మాట్లాడే నైపుణ్యమే విజయానికి కీలకం.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ జోన్ ఏజీఎం కె. ప్రసాద్ మాట్లాడుతూ.నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం 5 పుస్తకాలకే పరిమితం కాకుండా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వక్తృత్వ నైపుణ్యాలను. పెంపొందించుకోవాలని సూచించారు.వేదికపై ఏమాత్రం భయం లేకుండా ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే నైపుణ్యం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు.విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు.అనంతరం ఈ-చాంప్స్ ఆర్ అండ్ డీ హెడ్ వనిత మాట్లాడుతూ.పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభా పాటవాలు అద్భుతమని కొనియాడారు.చిన్నతనం నుంచే ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకుంటే రేపటి ఉత్తమ పౌరులుగా, నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.అనంతరం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఆలయ భూమిపై గ్రామస్తుల ఐక్య పోరాటం..

- శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆస్తిని కాపాడాల్సిందే..
- సర్వే నంబర్ 5 భూమిపై హక్కులు, రికార్డులు పరిశీలించి పరిరక్షణ చర్యలు చేపట్టాలి
- తహసీల్దార్‌కు గ్రామ ప్రజల వినతి

ప్రజా వాయిస్, తిమ్మాపూర్ (నవంబర్ 25)::

దేవుడి ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావుండకూడదని, తరతరాలుగా గ్రామ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకోవాల్సిందేనని మన్నెంపల్లి గ్రామస్తులు ఐక్యంగా గళమెత్తారు. గ్రామంలోని ఆలయానికి చెందిన సర్వే నంబర్ 5లోని భూమి పరిరక్షణ కోసం గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఏకమై తిమ్మాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయానికి చెందిన భూములు వ్యక్తిగత ప్రయోజనాలకు లోనుకాకుండా, వాటి అసలు హక్కులు, యాజమాన్య వివరాలు, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. సర్వే నంబర్ 5లోని భూమికి సంబంధించిన పాత రికార్డులు, ప్రస్తుత రెవెన్యూ నమోదులు, భూమి విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆలయ ఆస్తుల పరిరక్షణ అధికారుల బాధ్యత కాదా?

ఆలయ భూములు కేవలం ఆస్తులు మాత్రమే కాదని, అవి



గ్రామ ప్రజల విశ్వాసానికి, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇలాంటి ఆస్తుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా భవిష్యత్తులో వాటి ఉనికికే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల సంబంధిత రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆలయ భూమి హక్కులను పరిరక్షించాలని కోరారు.భూమికి సంబంధించిన రికార్డుల పరిశీలనతో పాటు అవసరమైతే క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, సరిహద్దులను గుర్తించి, ప్రభుత్వ రికార్డుల్లో ఆలయ భూమి వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఒక్కటైన గ్రామం.. ఆలయ ఆస్తి పరిరక్షణే లక్ష్యం.

ఈ వ్యవహారంలో గ్రామ సర్పంచ్ నుంచి మాజీ ప్రజాప్రతినిధుల వరకు, ఎండోమెంట్ కమిటీ సభ్యుల నుంచి కుల సంఘాల నాయకుల వరకు, గ్రామ పెద్దల నుంచి సామాన్య ప్రజల వరకు అందరూ ఒకే వేదికపైకి రావడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. రాజకీయ, సామాజిక విభేదాలకు అతీతంగా ఆలయ భూమిని కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా గ్రామస్తులు ముందుకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తహసీల్దార్ సమర్పించిన వినతిపై తక్షణమే స్పందించి, ఆలయ భూమి పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్, ఉప సర్పంచ్ బూడిద కిషోర్, వార్డు సభ్యులు గుంటి రామచంద్రం, సుదగోని పరశురాములు, సంధి లక్ష్మి, మాజీ సర్పంచులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మేడి అంజయ్య, ఎండోమెంట్ చైర్మన్ బుర్ర కనుకయ్య, ఎండోమెంట్ సభ్యులు గుంటి శ్రీనివాస్, పొట్ట శ్రీనివాస్, కుల సంఘాల అధ్యక్షులు కొలిపాక రామస్వామి, నాయకులు నర్ల అశోక్, గుర్రం జగదీశ్, దారిపెల్లి రమేష్, అశోద అంజయ్య, కామెర రవి, పోతుగంటి శ్రీనివాస్, రావుల శ్రీనివాస్, దుర్గం శ్రీనివాస్, మార్క సారయ్య, కొయ్యడ రాములు, తిరుపతి, బెనపెల్లి శ్రీనివాస్, తలపెల్లి కొమురయ్య, తలపెల్లి కిరణ్, గోదారి చిరంజన్ కుమార్, వేముల దేవేందర్, ఎం.డి. జాఫర్, పాములుగారి రాజకుమార్, గుంటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

రీసర్వే ద్వారా భూముల విస్తీర్ణంపై రైతులకు స్పష్టమైన వివరాలు అందించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

దామెర మండలం వెంకటాపూర్‌లో భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రజా వాయిస్ హన్మకొండ /దామెర

గ్రామంలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం వెంకటాపూర్‌లో భూములు కొలతలు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు.గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల



భూ విస్తీర్ణాన్ని రీ సర్వే చేశారని, ఇంకా ఎంత మిగిలి ఉందని, ఎన్ని రోజుల్లో రీ సర్వే పూర్తి చేస్తారని, భూముల కొలతల విధానం, సాంకేతిక పరికరాల వినియోగం తదితర అంశాలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు.భూముల కొలతలను పక్కాగా చేపట్టాలని సూచించారు. సర్వేయర్లు భూముల రీ సర్వే అనంతరం సంబంధిత రైతులకు సాగు విస్తీర్ణం ఎంత ఉందనే వివరాలతో స్పష్టతనివ్వాలన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా అదనంగా మరొక రోవర్ ను కేటాయించామని, మరొక గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించాలని సర్వేయర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల గ్రామాల సర్పంచులు పంచగిరి రాజు, చంద్రం, రవి యాదవ్, భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, డీఐ సతీష్ చంద్ర, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన
కేంద్రీకృత కొనుగోళ్ల విధానాన్ని వెంటనే రద్దుచేయాలి

గతంలో మాదిరిగా స్థానికంగా నాణ్యమైన సరుకులు కొనుగోలు చేసే విధానాన్ని పునరుద్ధరించాలి.

ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్

సంక్షేమ వసతి గృహాల్లో అమలు చేస్తున్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ విధానాన్ని రద్దు చేయాలి.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి.

మంద శ్రీకాంత్ జిల్లా కార్యదర్శి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్యం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ప్రభుత్వం తీసుకొచ్చిన కేంద్రీకృత కొనుగోళ్ల విధానం విద్యార్థుల సంక్షేమానికి గొడ్డలిపెట్టుగా మారిందని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు బుధవారం హనుమకొండ నగరంలోని రామ్ నగర్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాల నిర్వహణను మెరుగుపరచాల్సిన ప్రభుత్వం, విద్యార్థులకు అందించే నిత్యావసర సరుకుల కొనుగోళ్లను కేంద్రీకృతం చేయడం



ద్వారా స్థానిక కొనుగోళ్ల విధానానికి స్వస్తి పలికిందన్నారు. గతంలో వసతి గృహాల వార్డెన్లు, స్థానిక అధికారులు అవసరమైన సరుకులను నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం కాంట్రాక్టర్ల చేతుల్లోకి కొనుగోళ్ల వ్యవస్థ వెళ్లడంతో సరుకుల నాణ్యత, ధరలు, సరఫరా విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు

నాణ్యత లేని సరుకులతో విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు

సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన సరుకులు అందకపోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని, సరుకుల నాణ్యతను పరిశీలించకుండా సరఫరా చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని . కేవలం ధరలకే ప్రాధాన్యత ఇచ్చి నాణ్యతను పట్టించుకోకపోవడం సరికాదని, ప్రతి వసతి గృహానికి నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా ప్రభుత్వం పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు నమోదు కోసం తీసుకొచ్చిన ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ విధానం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని విమర్శించారు.మంద శ్రీకాంత్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతు అవసరమైన పరికరాలు, సాంకేతిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించకుండా విద్యార్థులపై ఈ విధానాన్ని రుద్దడం . విద్యార్థుల హాజరు పేరుతో వారి చదువుకు ఆటంకం కలిగించకుండా ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి

రాష్ట్రంలోని అనేక సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాల్లో, సరైన మౌలిక సదుపాయాలు లేని భవనాల్లో కొనసాగుతున్నాయని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సరైన వసతి, మరుగుదొడ్లు, తాగునీరు, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలు లేకుండా విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రతి సంక్షేమ వసతి గృహానికి సొంత భవనాలు నిర్మించి, విద్యార్థులకు గౌరవప్రదమైన వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, లేనిపక్షంలో విద్యార్థులను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ , జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్ , జిల్లా కమిటీ సభ్యులు, చెన్నూరి సాయికుమార్ , బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్, ఎండి ఇస్మాయిల్ కొమ్ముల, రాహుల్ , మంద మణిదీప్ ,భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

యాసంగిలో వరి వేస్తే నష్టమే-ఆరుతడి పంటలే లాభం

ఎల్‌నినోతో నీటి కొరత తప్పదు: కేవీకే శాస్త్రవేత్త నరేష్

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 25 :

చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామ రైతు వేదిక వద్ద బుధవారం నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో రైతులకు యాసంగి పంటల ప్రణాళికపై అవగాహన కల్పించారు.కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), గడ్డిపల్లి శాస్త్రవేత్త సి. హెచ్. నరేష్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగి, యాసంగిలో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అందుకే రైతులు నీటి లభ్యతను బట్టే పంటలు వేసుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్న రైతులు వరికి బదులుగా పెసర, మినుము, బొబ్బెర, శనగ, వేరుశనగ వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.నేల ఆరోగ్యం కోసం పంట అవశేషాలను భూమిలో కలపడం, సేంద్రియ పదార్థాన్ని పెంచడం, జీవ ఆధారిత



ఇన్‌పుట్‌లను వాడడం, పంట మార్పిడి పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని వివరించారు.మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ, వరి సాగుకు ఎక్కువ నీరు అవసరమని, నీటి కొరత ఉన్న చోట వరి వేస్తే మధ్యలో ఎండిపోయి దిగుబడి తగ్గుతుందన్నారు.



భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వాడాలని, సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రశేఖర్, రైతులు రాంబాబు, మహేష్, వీరస్వామి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్న
కట్టా మనోజ్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి

అక్రమంగా కడుతున్న నిర్మాణాలను తొలగించాలి
సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్
హనుమకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ జిల్లా అయినవోలు మండలం వెంకటాపురం గ్రామంలో సర్వే నంబర్ 324 లో కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వ భూమియని తేల్చినాక కూడా కబ్జాదారుడు నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రశ్నించారు.గత ఆరు నెలల క్రితం స్థానిక పేదలు, సిపిఐ చేసిన పోరాటం ఫలితంగా మండల రెవెన్యూ అధికారులు ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి అని తేల్చినాక కూడా దానికి హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నశీదున కబ్జాదారుడు రెచ్చిపోయి ప్రభుత్వ భూమి చుట్టూ ఫినిషింగ్ చేస్తూ స్థానిక రైతులను, పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, ఇదేమిటని అడిగిన వారిపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నాడని, ఈ పరిస్థితిని నిరసిస్తూ గత వారమే స్థానిక ఐనవోలు మండల తహసిల్దారు, ఆర్డిఓకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. దీంతో బుధవారం పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహాధర్నా కార్యక్రమం హనుమకొండ ఆర్డిఓ ఆఫీస్ ముందు చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు



జరిగిన ఈ ఆందోళనలోపేదలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల తీరును ఈ సందర్భంగా జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు తీవ్రంగా దుయ్యబట్టారు. కబ్జా దారుల కొమ్ముకాస్తున్నారని ఒక సందర్భంలో ఆరోపణలు సైతం చేయాల్సి వచ్చింది. 100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కబ్జాదారుడైన కట్ట మనోజ్ రెడ్డి పైన తక్షణమే ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శాంతియుతంగా జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి వచ్చి సమాధానం చెప్పాల్సిన అధికారులు ఈ సందర్భంగా పోలీసులను పిలిపించడంతో ఆందోళనకారులు మరింత తీవ్రంగా కబ్జా దారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.దీంతో ఆర్డీవో మాట్లాడుతూ కచ్చితంగా కబ్జాదారుడు పైన చర్యలు తీసుకుంటామని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని నాయకులు -ప్రజల తో జరిగిన చర్చల సందర్భంగా హామీ ఇచ్చారు.ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేదంటే ప్రజలే అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడటానికి ముందుకు వస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, కర్రే లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, జిల్లా సమితి సభ్యులు మాలోతు శంకర్ నాయక్, నాయకులు మాదాసు యాకూబ్, అల్వాల రాజు, పాము రమ, గుమ్మడి రాజుల సుధాకర్, కొట్టే వెంకటేష్, జూకంటి పద్మ, ఆరోరి భాగ్య, ఆలకుంట యాకయ్య, కుటుంబ రామారావు, మాదాసు మాణిక్యం, యాకమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి అండగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్

మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం
అందించిన ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజా వాయిస్/రాయపర్తి

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన ఈరసారపు సక్కుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, నిరుపేద కుటుంబాలకు తోడ్పాటు అందించడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ ఆర్థిక సహాయాన్ని రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, 5 వార్డు నంబర్ పరుపాటి రవీందర్‌రెడ్డి, గాడిపల్లి రాములు, పార్టీ ముఖ్య నాయకులు గబ్బెట యాకయ్య, గుడెల్లి వెంకటయ్య, పెరటి యాదవరెడ్డి, పసునూరి శ్రీనివాస్, బొమ్మినేని సురేందర్‌రెడ్డి, లేతకుల యాకూబ్‌రెడ్డి, కోరెం భూపాల్‌రెడ్డి తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు.



న్యాయవాదుల సమస్యలపై ఐఏఎల్ డిమాండ్ల పోస్టర్ ఆవిష్కరణ

ఈ-ఫైలింగ్‌తో పాటు భౌతికంగా కేసుల దాఖలుకు అవకాశం కల్పించాలి
న్యాయవాదులకు సమగ్ర సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) వరంగల్, హనుమకొండ జిల్లా కౌన్సిళ్ల ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన డిమాండ్ల పోస్టర్‌ను బుధవారం వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఐఏఎల్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. గీతామాకు, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్. సునీతకు సమర్పించారు.ఈ సందర్భంగా ఐఏఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భీమనాథ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులు, ఆర్థికంగా వెనుకబడిన న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ-ఫైలింగ్‌తో పాటు



భౌతికంగా కేసుల దాఖలుకు అవకాశం కొనసాగించాలని, న్యాయవాదులకు ఆరోగ్య బీమా, పెన్షన్, జూనియర్ న్యాయవాదులకు నెలవారీ స్టైఫండ్, న్యాయవాదుల రక్షణ, కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.డిజిటలైజేషన్ న్యాయవ్యవస్థను సులభతరం చేయాలే తప్ప న్యాయవాదులకు,కక్షిదారులకు ఇబ్బందులు కలిగించకూడదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఐఏఎల్ నాయకులు ప్రధానంగా పది డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు:మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వాష్‌రూములు, వెయిటింగ్ రూములు, భద్రత కల్పించాలని,నూతన చట్టాలు, ఈ-కోర్టులు, డిజిటల్ ఆధారాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని,న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. న్యాయవాదులు న్యాయవ్యవస్థలో కీలక భాగమని, వారి వృత్తిపరమైన గౌరవం, ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రభుత్వంతో పాటు సంబంధిత న్యాయ అధికారులు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు కోరారు. న్యాయవాదుల సంక్షేమం బలోపేతం అయినప్పుడే న్యాయవ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. ఉపేందర్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. రామకృష్ణ . వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన న్యాయవాదులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, బి. ప్రభాకర్, కె. చిరంజీవి ఎం. సదాశివుడు, అడ్వకేట్ జయశంకర్ దిలీప్, రఫీ, సలావుద్దీన్, కేతరాజు సతీష్, ఎం. సంతోష్, ఎన్. చంద్ర మౌళి, శ్రవణ్ కుమార్, ఎన్. కార్తీక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన ఆకుల శ్రీనివాస్

బెల్లంపల్లి నవంబర్ 25 ప్రజా వాయిస్

బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన వంట మాస్టర్ ఆకుల శ్రీనివాస్ (55) గుండెపోటుతో మంగళవారం మృతి చెందగా, విషాదంలోనూ ఆయన కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. జనహిత సేవా సమితి సభ్యులు అనుముల సత్యనారాయణ, భాస్కర్ నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు.వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు మంగళవారం రాత్రి 11 గంటలకు కార్నియాలను సేకరించారు. దీంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగింది.ఈ సందర్భంగా



జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ.. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల నిర్ణయం అభినందనీయమని, జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఇది 28వ నేత్రదాన కార్యక్రమమని తెలిపారు. ప్రజలు అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీరదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమానికి సహకరించిన కుటుంబ సభ్యులు, అనుముల సత్యనారాయణ, భాస్కర్, కోశాధికారి కోడిపెల్లి గిరిప్రసాద్, డోలి సుకుమార్, వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు వాసన్ ఐ బ్యాంక్ అభినందన పత్రాన్ని అందజేసింది,మరణానంతరం కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన ఆకుల శ్రీనివాస్ కుటుంబం ఆదర్శంగా నిలిచింది.

8 మంది నిరుపేదలకు సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ..

కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్.

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

ఎల్కతుర్తి గ్రామానికి చెందిన 8 మంది నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు నాంపల్లి కవిత, చందుపట్ల రోహిత్ ప్రీతం, నల్లాల జనార్దన్ రెడ్డి, ఐతే. శివకుమార్, కడారి కొమురమ్మ, శనిగరం సుమతి, రాస రంజిత్, శనిగరం మమత, ఈ సందర్భంగా చెక్కులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హుస్నాబాద్ శాసనసభ్యులు రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొడిశాల యాదగిరి గౌడ్, శనిగరం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్ (బక్కి) అంబాల జగన్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గొడిశాల అర్జున్ గౌడ్, వెంకట్, రమేష్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల సాకుతో నట్టేట ముంచారు..
నరకప్రాయంగా నర్సాపూర్ రహదారి!

కుంటాల-నర్సాపూర్ (జి) రోడ్డు పనులకు మధ్యలోనే బ్రేక్....
వాహనదారులకు నరకయాతన రోడ్డుపై మట్టి కుప్పలు, గుంతలతో నిత్యం ప్రమాదాలు..

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి రెండు మండలాల ప్రజలకు శాపంగా మారాయి.కుంటాల మండలం నుండి నర్సాపూర్ (జి) నందన్ ఎక్స్ రోడ్డు వరకు నిర్మిస్తున్న కీలక రహదారి పనులను కాంట్రాక్టర్ అర్ధాంతరంగా నిలిపివేయడంతో ప్రయాణికులు,వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.భామ్నీ నుండి నందన్ ఎక్స్ రోడ్ వరకు అధ్వాన్నం ఈ రహదారి పనులను బామ్ని గ్రామం చివరి వరకు పూర్తి చేసిన కాంట్రాక్టర్, అక్కడి నుండి అసలైన రద్దీ ఉండే భామిని గ్రామంలో నుండి నర్సాపూర్ నందన్ ఎక్స్ రోడ్ (చీఘఅఝఅ శ =శీఘఅ) వరకు పనులు చేయకుండా మధ్యలోనే వదిలేశారు.కీలకమైన ఈ మార్గంలో తారు పూర్తిగా లేచిపోయి భారీ గుంతలు ఏర్పడటంతో పాటు,రోడ్డుపైనే మొరం (ఎర్ర మట్టి) కుప్పలు పోసి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు,ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలకు గురిగి అవకాశాలున్నాయి అయినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాంట్రాక్టర్ చిత్రవిచిత్ర సాకులు.రోడ్డు పనులు ఎందుకు ఆపారని సంబంధిత కాంట్రాక్టర్‌ను సంప్రదించగా.."ప్రస్తుతం మెటీరియల్ అందుబాటులో లేదు,బిల్లులు రాక డబ్బులు లేవు, నిర్మాణ సామగ్రి ఛార్జీలు విపరీతంగా పెరిగాయి" అంటూ సాకులు చెబుతూ పనులను జాప్యం చేస్తున్నారు.కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందులు,ఛార్జీల పెంపు పేరుతో సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసమని స్థానికులు మండిపడుతున్నారు.ఇంత జరుగుతున్నా సంబంధిత రోడ్లు భవనాల శాఖ (=&దీ/ూ=) అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బామ్ని నుండి నందన్ ఎక్స్ రోడ్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.





బేస్‌బాల్ బ్యాట్‌తో యువకుడిపై దాడి..

కారుతో బైక్‌ను ఢీకొట్టి.. కిందపడిన యువకుడి తలపై విచక్షణారహితంగా దాడి

ప్రజావాయిస్ ॥ రాజేంద్రనగర్:

శంషాబాద్‌లో యువకుడిపై బేస్‌బాల్ బ్యాట్‌తో దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. రోటరీ-1 సమీపంలో కారుతో బైక్‌ను ఢీకొట్టిన వ్యక్తి, కిందపడిన యువకుడిపై బ్యాట్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.పోలీసుల వివరాల ప్రకారం.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తేలగతోటి నాగభూషణరావు (26) నవంబర్ 25న తెల్లవారుజామున స్నేహితుడి పల్సర్ బైక్‌పై విమానాశ్రయానికి బయలుదేరారు. ఉదయం 5.30 గంటల సమయంలో రోటరీ-1 వద్దకు చేరుకోగానే ప్రసన్నకుమార్ అనే వ్యక్తి ఎరుపు రంగు శాంత్రో కారుతో వెనుక నుంచి రెండుసార్లు బైక్‌ను ఢీకొట్టినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన నాగభూషణరావును నిందితుడు బెదిరించి, కారులో ఉన్న బేస్‌బాల్ బ్యాట్‌తో తలపై దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. అక్కడే ఉన్న క్యాబ్ డ్రైవర్లు వెంటనే స్పందించి బాధితుడిని ఆస్పత్రికి తరలించడంతో పాటు డయల్ 112కు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 109(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





మురుగు శుద్ధి కేంద్రాలా.. మృత్యు కుహరాలా..?

విషవాయువులతో ముగ్గురు కార్మికుల మృతి

ఎస్‌టీపీల భద్రతపై హైడ్రా ప్రత్యేక దృష్టి

నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక

త్వరలో ఎస్‌టీపీల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం

ప్రజావాయిస్,హైదరాబాద్:

మురుగునీటిని శుద్ధి చేసే ఎస్‌టీపీ కేంద్రాలే కార్మికుల పాలిట మృత్యు కుహరాలుగా మారుతున్నాయి.బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్, ఏపీఆర్ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం ఎస్‌టీపీ ట్యాంకు శుభ్రం చేస్తూ విషవాయువులు పీల్చి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటనపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు.బుధవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఆయన హైడ్రా, సీఎంసీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఒకరి తర్వాత ఒకరు ట్యాంకులోకి దిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టీపీల నిర్మాణంతో పాటు నిర్వహణలోనూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,నిర్లక్ష్యం వహించే నిర్వాహకులు, ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గేటెడ్ కమ్యూనిటీలు నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి చేతులు దులుపుకోరాదని స్పష్టం చేశారు.ట్యాంకుల్లో విషవాయువులు పేరుకుపోకుండా వెంటిలేషన్,గ్యాస్ బయటకు వెళ్లే ఏర్పాట్లు ఉండాలని,శుభ్రపరిచే కార్మికులకు శిక్షణతో పాటు శ్వాస రక్షణ పరికరాలు అందించాలని సూచించారు.శుద్ధి చేసిన నీరు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో కూడా పర్యవేక్షించాలన్నారు.నగరంలోని ఎస్‌టీపీల నిర్వాహకులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పిస్తామని,తనిఖీలను ముమ్మరం చేస్తామని తెలిపారు.దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు,హెచ్‌ఆర్ ఇన్విరో సంస్థకు మధ్య నిర్వహణ ఒప్పందం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.ఈ ఘటనపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ పరిశీలనలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య,డీఎఫ్ఓ గౌతం,ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్, సీఎంసీ అధికారులు, అక్కడి నివాసితులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 'ప్రజా ట్రస్ట్' చేయూత!

భైంసా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు: ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహనరావు పాటిల్

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో విద్యా ప్రోత్సాహాన్ని పెంపొందించే లక్ష్యంతో 'మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్' ఆధ్వర్యంలో బుధవారం భైంసా మండలంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు,ప్రాథమికోన్నత పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.పది, ఇంటర్ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహనరావు పాటిల్ పాల్గొని 10వ తరగతి విద్యార్థులకు'ఆల్ ఇన్ వన్' పుస్తకాలను, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం (11, 12వ తరగతులు) విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.ఈ సందర్భంగా భోస్లే మోహనరావు పాటిల్ మాట్లాడుతూ.ఆర్థిక ఇబ్బందులు లేదా సరైన విద్యా సామగ్రి లేదనే కారణంతో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. విద్యార్థుల విజయమే ప్రజా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యా వనరులు అందించేందుకు ప్రజా ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలు,కళాశాలల ఉపాధ్యాయులు,అధ్యాపకులు, ప్రజా ట్రస్ట్ సభ్యులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చైర్మన్ భోస్లే మోహనరావు పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పోలీస్ కార్యాలయాల తనిఖీ.. పెండింగ్ కేసుల పరిష్కారానికి డీఐజీ ఆదేశాలు

కేసముద్రం, తొర్రూరు పోలీస్ కార్యాలయాలను తనిఖీ చేసిన డీఐజీ ఎన్. శ్వేత

ప్రజా వాయిస్,మహబూబాబాద్

వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్. శ్వేత, ఐపీఎస్ మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం సర్కిల్ పోలీస్ కార్యాలయం, తొర్రూరు డీఎస్పీ కార్యాలయాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.ముందుగా కేసముద్రం సర్కిల్ పోలీస్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన డీఐజీ, అనంతరం పోలీస్ అధికారులతో సమీక్షించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరస్థులపై చట్టపరమైన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కేసముద్రంలో సీఐ వై. సత్యనారాయణ డీఐజీకి పూల మొక్క అందించి స్వాగతం పలకగా, పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. తొర్రూరులో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, డీఎస్పీ కె. కృష్ణ కిషోర్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అక్కడ కూడా పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతి కిరణ్, పి. నరేష్, జి. కర్ణాకర్, తొర్రూరు డీఎస్పీ కె. కృష్ణ కిషోర్, సీఐలు టి. గణేష్, ఎల్. పవన్ కుమార్, ఎస్ఐ టి. మహేందర్ రెడ్డితో పాటు వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కుటుంబ పెద్దకు రూ.5 లక్షల బీమా రక్షణ

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తికి మాత్రమే బీమా వర్తింపు

- 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల వారికి అవకాశం

- బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీలకు రూ.5 లక్షల పరిహారం

- ఆధార్, రేషన్ కార్డు, నామినీ వివరాలతో నమోదు

- 8వ వార్డు కౌన్సిలర్ గుగ్లోత్ రమేష్ విజ్ఞప్తి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన కుటుంబాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్



గుగ్లోత్ రమేష్ కోరారు. పల్లెపహాడ్ 8వ వార్డులో పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన కుటుంబాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గుగ్లోత్ రమేష్ మాట్లాడుతూ.. కుటుంబాన్ని పోషించే వ్యక్తికి అనుకోని పరిస్థితుల్లో మరణం సంభవిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. ఈ పథకానికి సంబంధించిన బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. కుటుంబంలో సంపాదించే 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల ఒక వ్యక్తికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. నామోదు సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబరుతోపాటు అవసరమైన వివరాలను సమర్పించాలని సూచించారు. బీమా పొందే వ్యక్తి వివరాలతోపాటు ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది నామినీల వివరాలను కూడా తప్పులు లేకుండా నమోదు చేయించుకోవాలని కోరారు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీలకు రూ.5 లక్షల పరిహారం అందుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకంపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని రమేష్ కోరారు. అర్హత ఉన్నవారు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని, పథకం ప్రయోజనాలు అందరికీ చేరేలా స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్ము ఉమేష్ యాదవ్, గూడూరి కర్ణాకర్, కొమ్ము దేవేందర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనపై ఉన్న శ్రద్ధ రైతుల సంక్షేమంపై ఏదీ?

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ చర్యలేవి?

- సాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రకటించాలి

- విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాలి

- రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే చర్యలు చేపట్టాలి

- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి డిమాండ్

ప్రజా వాయిస్ సిద్ధిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోందో స్పష్టం చేయాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు చూపుతున్న శ్రద్ధలో కొంతైనా రైతుల సంక్షేమంపై చూపాలని సీఎం రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావం వల్ల సాగునీటి లభ్యత తగ్గే పరిస్థితులు ఉంటే రైతులను ముందుగానే అప్రమత్తం చేయడంతోపాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాగునీటి వసతి కల్పించడం, నిరంతర విద్యుత్ సరఫరా అందించడం, నీటి కొరతను అధిగమించే మార్గాలను అన్వేషించడం తక్షణ ప్రాధాన్యాలుగా ఉండాలని సూచించారు. వచ్చే పంటల సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగుపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని కోరారు. రైతులు నష్టపోకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించడంతోపాటు వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళనకు వేల కోట్లు ఖర్చు చేయాలన్న ప్రభుత్వ ఆసక్తి రైతుల సమస్యల పరిష్కారంపైనా ఉండాలని, ప్రజాధనంలోని ప్రతి రూపాయి ప్రజలకు, ముఖ్యంగా అన్నదాతలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగించాలని యాదగిరి పేర్కొన్నారు. ప్రాజెక్టులు, ప్రక్షాళన కార్యక్రమాలతోపాటు వ్యవసాయ రంగానికి కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చి రైతుల కష్టాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు



ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారలేదా?

పంతొమ్మిదేళ్లుగా పట్టాల కోసం నిరీక్షణ..

ఎర్రజెండాలతో పేదల పోరుబాట

పైరవీకారుల కుట్రలపై అప్రమత్తం.. సీపీఎం నేత ధనియాకుల శ్రీకాంత్ వర్మ ఘాటు విమర్శ

ప్రజా వాయిస్, పెన్‌పహాడ్:

పాలకులు మారినా, పాలన పగ్గాలు ఎవరు చేపట్టినా నిరుపేదల కష్టాలు మాత్రం తీరడం లేదు. కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడు కోసం నేటికీ సామాన్యులు పోరాడాల్సిన దుస్థితి నెలకొంది.సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలో భూమి కోసం సాగుతున్న ఆందోళనలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను ఉద్దేశించి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రైతుల నుంచి 2 ఎకరాల 06 గుంటల భూమిని కొనుగోలు చేసింది. కానీ, పంతొమ్మిదేళ్లు గడుస్తున్నా పేదలకు భూమి పంచకపోవడం, పట్టాలు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేటాయించిన ఈ భూమికి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన



తర్వాత కూడా పట్టాలు దక్కలేదని విమర్శించారు. ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు మారినా పేదల బాగోగులు పట్టించుకున్న వారే లేరని అన్నారు.ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ తరుణంలో కొంతమంది పైరవీకారులు గతంలో భూమి అమ్ముకున్న రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ అడ్డగోలుగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులను మభ్యపెట్టి, లేనిపోని విషయాలు చెప్పి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూడా కొందరు తప్పుడు పద్ధతిలో రెవెన్యూ రికార్డులు సృష్టించి దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు ఇలాంటి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామంలో ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి గుడిసెలు వేసిన పేదలకు పట్టాలు పంపిణీ చేసేంతవరకు సీపీఎం అండగా నిలబడి పోరాడుతుందని శ్రీకాంత్ వర్మ స్పష్టం చేశారు.

కార్యక్రమ విశేషాలు:

ఈ నిరసన కార్యక్రమంలో భూ పోరాట కమిటీ కన్వీనర్ మామిడి అంబేద్కర్‌తో పాటు సిరి, కిరణ్, రమణ, శైలజ, బిందు, నాగయ్య, వెంకన్న, వెంకటమ్మ, నాగమణి మరియు పలువురు గ్రామస్తులు, సీపీఎం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగుడి దీనస్థితిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఆర్థిక సాయం కోసం సచివాలయానికి వెళ్తే అవమానించారంటూ మహేశ్ ఆవేదన..

- కారుణ్య మరణానికి అనుమతించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



ప్రజా వాయిస్ మంథని

ఒకవైపు తీవ్రమైన అనారోగ్యం.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. ఆదుకోవాల్సిన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఓ దివ్యాంగుడు చివరకు కారుణ్య మరణానికి అనుమతించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత నియోజకవర్గమైన మంథనికి చెందిన తోకాల మహేశ్ కుమార్ పరిస్థితి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తోకాల మహేశ్ కుమార్ గత 20 ఏళ్లుగా మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే జన్యుపరమైన కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రభుత్వ వైద్య బోర్డు జారీ చేసిన దివ్యాంగ ధ్రువీకరణ పత్రం ప్రకారం ఆయనకు 75 శాతం శారీరక వైకల్యం ఉంది. అధిక స్థాయి సహాయం అవసరమైన దివ్యాంగుడిగా గుర్తింపు పొందేందుకు కూడా అర్హత ఉన్నప్పటికీ, తనకు అందాల్సిన ఆర్థిక సహాయం అందడం లేదని మహేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సాయం కోరితే నిరాశే ఎదురైందా?

తన దీనస్థితిని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సహాయం పొందాలనే ఆశతో మహేశ్ తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి వెళ్లాడు. అయితే సచివాలయంలోకి ప్రవేశించేందుకు అనుమతి పాస్ అవసరమని పోలీసు సిబ్బంది తనను లోపలికి అనుమతించలేదని బాధితుడు తెలిపాడు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి తన సమస్యను వివరించగా, బడ్జెట్ లేదని చెప్పడంతో పాటు 'నువ్వు బతికి ఉండి ఏం లాభం?' అన్నట్లుగా మాట్లాడి నిరుత్సాహపరిచారని మహేశ్ ఆరోపించాడు. తనకు భరోసా కల్పించాల్సిన ప్రజాప్రతినిధి నుంచి ఇలాంటి స్పందన ఎదురవడం బాధ కలిగించిందని వాపోయాడు.

కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

తన ఆరోగ్య పరిస్థితి, జీవన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని అధిక స్థాయి సహాయం అవసరమైన వ్యక్తిగా గుర్తించేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు కూడా పంపించినట్లు మహేశ్ వెల్లడించాడు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆర్థిక సహాయం అందలేదని తెలిపాడు. సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కార్యాలయాల చుట్టూ తిరగడానికే తనకు వస్తున్న కొద్దిపాటి పెన్షన్ కూడా ఖర్చయిపోయిందని, ఈ ప్రక్రియ తనను శారీరకంగా, మానసికంగా మరింత కుంగదీస్తోందని తెలిపాడు.

న్యాయ సేవాధికార సంస్థకు మొర

మహేశ్ ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన పెద్దపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తన తరఫున సంబంధిత అధికారులకు లేఖలు రాసినట్లు బాధితుడు వెల్లడించాడు. అయినప్పటికీ తన సమస్యకు పరిష్కారం లభించలేదని వాపోయాడు.

తల్లితో కలిసి సచివాలయం ముందు నిరసన

ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం, అవసరమైన వైద్యపరమైన తోడ్పాటు అందించాలని, తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఆదుకోవాలని మహేశ్ కోరుతున్నాడు. లేనిపక్షంలో తనకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన తల్లితో కలిసి రాష్ట్ర సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేశాడు. ఒక దివ్యాంగుడు 20 ఏళ్లుగా వ్యాధితో పోరాడుతూ, కనీస జీవన అవసరాల కోసం ప్రభుత్వ సహాయం కోరుతూ చివరకు మరణానికి అనుమతి ఇవ్వాలని వేడుకునే పరిస్థితి రావడం ఆందోళన కలిగిస్తోంది. మహేశ్‌కు అర్హత ప్రకారం అందాల్సిన సహాయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, అవసరమైన ఆర్థిక, వైద్య సహాయం అందించాల్సిన అవసరం ఉంది.



గోదావరి పుష్కరాలకు రూ.1,100 కోట్లతో ఏర్పాట్లు

గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.1,100 కోట్లు కేటాయించిందని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. బుధవారం భద్రాచలంలో పర్యటించిన ఆయన, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సమీక్షించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి నదీ తీరం వెంబడి చేపట్టిన పనులతో పాటు, ఆలయాల పునరుద్ధరణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు.ఈ పర్యటనలో భాగంగా రంగనాయకుల గుట్ట సమీపంలో రూ.5.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి రిజర్వాయర్, పైప్‌లైన్లు, పంపింగ్ వ్యవస్థ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, స్నానఘట్టాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం, కొత్త మార్కెట్ ప్రాంతంలో రూ. కోటితో చేపట్టనున్న గ?రిజన బహుళార్థసాధక (మల్టీపర్పస్) మార్కెట్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.300 కోట్లు కేటాయించినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. డిసెంబర్ 19న జరిగే తెప్పోత్సవం, 20న నిర్వహించే ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి భారీ చోరీ.. 10 మంది నిందితుల అరెస్ట్

ఘట్కేసర్ పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదింపు

బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం





ప్రజావాయిస్ , ఘట్కేసర్ :

ఇంటి తాళం పగలగొట్టి రాత్రి సమయంలో చోరీకి పాల్పడిన కేసును ఘట్కేసర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న 10 మంది నిందితులను అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు, ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇంటికి తాళం వేసి వెళ్లగా చోరీ

ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామం, లేక్ వ్యూ ఎన్‌క్లేవ్‌లోని వైష్ణవి రెసిడెన్సీలో ఈ చోరీ ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదుదారుడు వి. నవీన్ కుమార్ (45) ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి, ప్రమాదానికి గురైన తన స్నేహితుడిని పరామర్శించేందుకు బోడుప్పల్‌కు వెళ్లాడు. అక్కడే స్నేహితుడి ఇంట్లో బస చేశాడు.అనంతరం నవంబర్ 18వ తేదీ ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా, డైనింగ్ హాల్ పక్కన ఉన్న కిటికీ పగలగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి ఉండటంతో పాటు అందులో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు 18 తులాల బంగారు ఆభరణాలు, వాటి విలువ రూ.3.60 లక్షలుగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

10 మంది అరెస్ట్.. ఒకరు పరారీ

ఈ ఘటనపై ఘట్కేసర్ పోలీసులు క్రైమ్ నంబర్ 674/2026, సెక్షన్లు 331(4), 305(ూ), 317(2) దీమీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, నిరంతర విచారణతో నిందితులను గుర్తించి నవంబర్ 24న యంనంపేట్ ఎక్స్ రోడ్ వద్ద 10 మందిని అరెస్టు చేశారు. మరో నిందితుడు మనుసాల వెంకటేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితుల వివరాలు:

అరెస్టయిన వారిలో గాంధీనగర్‌కు చెందిన కె. సామెల్ అలియాస్ నాని, పిట్టల ఉమర్, మార్కల సాయికుమార్, బాలాజీనగర్‌కు చెందిన షేక్ సద్దాం షరీఫ్, షేక్‌పేటకు చెందిన ఎస్.డి. సిద్ధిఖ్, మైసమ్మగుట్ట కాలనీకి చెందిన నొకటాల మోతీలాల్, నొకటాల షబ్బు, చిలకలగూడకు చెందిన శక్తి విశాల్, ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా ఉపమాక గ్రామానికి చెందిన గణసాల రైలన్ మ్యాక్స్, పిట్టల పాపిత ఉన్నారు.పరారీలో ఉన్న నిందితుడు మనుసాల వెంకటేష్ (24) తుని, అనకాపల్లి జిల్లాకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు.

చోరీ సొత్తు స్వాధీనం:

నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తులో బంగారు నెక్లెస్, బుట్ట కమ్మలు, చంద్రహారం, జడపువ్వు, గొలుసులు, ఉంగరాలు తదితర ఆభరణాలు ఉన్నాయి. వీటితో పాటు సుమారు 24 తులాల వెండి ఆభరణాలు, ఐఫోన్ 14, ఐఫోన్ 14 ప్లస్, రూ.53 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. రెండు ఐఫోన్ల విలువ సుమారు రూ.1.05 లక్షలుగా అంచనా వేశారు.

తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని..

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఏ-1, ఏ-2లు గతంలోనూ ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇంటి దొంగతనాలకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇంటికి తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, కిటికీలు లేదా తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.

పోలీసు బృందానికి కమిషనర్ అభినందనలు

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. కిరణ్, ఎస్ఐ ఎ. రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కేసును ఛేదించారు.ఈ ఆపరేషన్‌లో హెచ్‌సీలు ఆర్. రాజేష్, పి. విజయ్ కుమార్, పీసీలు పి. రాజు, ఎన్. నరేష్, నరేందర్, బి. సైదులు, మహిళా పీసీ బి. మహేశ్వరి, హోంగార్డు బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

ప్రజలకు పోలీసుల సూచనలు

ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు....



దేశీయంగానే 84 శాతం బంగారు నిల్వలు.. విదేశాల నుంచి పసిడిని తరలిస్తున్న ఆర్‌బీఐ

భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన పసిడి నిల్వల భద్రతకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. సెప్టెంబర్ 2024 నాటికి ఆర్‌బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వల్లో 84 శాతాన్ని దేశీయంగానే భద్రపరిచినట్లు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో, విదేశాల్లో ఉన్న బంగారాన్ని స్వదేశానికి తరలించే ప్రక్రియను ఆర్‌బీఐ వేగవంతం చేసింది.ఆర్‌బీఐ విడుదల చేసిన అర్ధవార్షిక నివేదిక ప్రకారం, ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద మొత్తం 880.52 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. ఇందులో 740.13 టన్నులను దేశీయంగా నిల్వ చేయగా, మిగిలిన 140.39 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద భద్రపరిచారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే సుమారు 60 టన్నుల బంగారాన్ని విదేశాల నుంచి భారత్‌కు తరలించారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి దేశీయ నిల్వలు 77 శాతంగా ఉండగా, ప్రస్తుతం ఆ వాటా 84 శాతానికి పెరిగింది.అయితే, నిల్వల పరిమాణం స్థిరంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల వల్ల వాటి విలువలో మార్పులు చోటుచేసుకున్నాయి. దేశ విదేశీ మారక నిల్వల్లో పసిడి వాటా విలువ మార్చిలో 16.7 శాతంగా ఉండగా, సెప్టెంబర్ నాటికి అది 14.38 శాతానికి తగ్గింది. దీని విలువ సుమారు 115.4 బిలియన్ డాలర్ల నుంచి 106 బిలియన్ డాలర్లకు పడిపోయింది. గత రెండేళ్లుగా ఆర్‌బీఐ తన నిల్వల నిర్వహణ ప్రాధాన్యతల్లో భాగంగా బంగారాన్ని స్వదేశానికి తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించింది.

మురికికూపం నుంచి మణిహారంగా..సున్నం చెరువుకు హైడ్రా కొత్త రూపు

14 ఎకరాల నుంచి 32 ఎకరాలకు విస్తరణ

రూపాయలు కాదు,ప్రకృతి సంపదకు పునర్జీవం

డిసెంబర్ 2,3 తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైడ్రా అదనపు కమిషనర్ డి. ఆనందకుమార్,ఏసీపీ తిరుమల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజావాయిస్.హైదరాబాద్:

ఒకప్పుడు ఆక్రమణలు,మురుగునీరు, దుర్వాసనతో మురికికూపంగా మారిన మాదాపూర్ పరిధిలోని గుట్టల బేగంపేట వద్ద ఉన్న సున్నం చెరువును హైడ్రా పునరుద్ధరించింది.సున్నం చెరువు నేడు సరికొత్త రూపును సంతరించుకుంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ పనులతో చెరువు విస్తీర్ణం 14 ఎకరాల నుంచి 32 ఎకరాలకు పెరిగింది.వాకింగ్ ట్రాక్,పార్కులు,ఓపెన్ జిమ్, వ్యూ పాయింట్ వంటి సౌకర్యాలతో ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దారు.అభివృద్ధి చేసిన చెరువును డిసెంబర్ 2,3 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం రాత్రి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, వాకింగ్ పాత్,బండ్ నిర్మాణాలను తనిఖీ చేశారు.ప్రవేశ ద్వారాలతో పాటు పెద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌ను సందర్శించారు.పార్కులు, చిన్నారుల ఆట స్థలాలు, ఓపెన్ జిమ్ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ పర్యటనలో

14 ఎకరాల నుంచి 32 ఎకరాలకు విస్తరణ

గతంలో ఆక్రమణల కారణంగా 14 ఎకరాలకు పరిమితమైన సున్నం చెరువును హైడ్రా ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలను తొలగించి 32 ఎకరాలకు విస్తరించింది.ఆక్రమణల తొలగింపు సమయంలో నిరసనలు,ఆందోళనలు ఎదురైనా చెరువు పునరుద్ధరణ పనులను కొనసాగించింది.ఫలితంగా చెరువు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగింది.గతంలో 47.58 మిలియన్ లీటర్లుగా ఉన్న నిల్వ సామర్థ్యం ప్రస్తుతం 200 మిలియన్ లీటర్లకు చేరింది.నీరు నిల్వ ఉండే విస్తీర్ణం 9 ఎకరాల నుంచి 16 ఎకరాలకు పైగా పెరిగింది.

వరద ముప్పునకు చెక్... ప్రజలకు ఆహ్లాదం

చెరువుకు సంబంధించిన ఇన్‌లెట్లు,ఔట్‌లెట్లను సరిచేసి అభివృద్ధి చేయడంతో వర్షపు నీటి ప్రవాహానికి మార్గం మెరుగుపడింది.దీంతో గుట్టల బేగంపేట, నవభారత్ నగర్ తదితర ప్రాంతాలకు వరద ముప్పు తగ్గించడంలో సున్నం చెరువు కీలక పాత్ర పోషించనుంది.మరోవైపు చెరువు చుట్టూ 1.35 కిలోమీటర్ల పొడవున నిర్మించిన వాకింగ్ పాత్ స్థానికులకు నడక, వ్యాయామానికి ఉపయోగపడనుంది. చిన్నారుల కోసం ప్లే ఏరియాలు,అన్ని వయసులవారికి ఉపయోగపడే ఓపెన్ జిమ్, ఆహ్లాదకరమైన పార్కులను ఏర్పాటు చేశారు.పెద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.ఆక్రమణలు,కాలుష్యంతో కనుమరుగయ్యే పరిస్థితికి చేరిన చెరువును పునరుద్ధరించి పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా హైడ్రా అభివృద్ధి చేసింది. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరమవుతున్నాయి.



మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట పీఎస్.. సమస్య నోటితో చెబితే ఫిర్యాదు కాపీ రెడీ!

టెక్నాలజీ సాయంతో పోలీస్ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే దిశగా తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను 'మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్'గా ఎంపిక చేసింది. ఈ పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థల పనితీరును రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయన వెంట అడిషనల్ డీజీపీ అకున్ సబర్వాల్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ ఉన్నారు.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పోలీస్ సేవల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా తొలిసారిగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఐ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇకపై బాధితులు పోలీస్ అధికారుల కోసం గంటల తరబడి స్టేషన్‌లో ఎదురుచూడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఫిర్యాదుదారులు ఏఐ యంత్రం ముందు నిలబడి తమ సమస్యను నోటితో వివరిస్తే చాలని, ఆ యంత్రమే బాధితులు చెప్పిన వివరాలతో ఫిర్యాదు కాపీని స్వయంగా రూపొందిస్తుందని వివరించారు.ఆ తర్వాత ఆటోమేటిక్‌గా సంబంధిత పోలీస్ అధికారులకు ఆ ఫిర్యాదు చేరుతుందని డీజీపీ తెలిపారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా ప్రజలకు పోలీస్ సేవలను సత్వరమే చేరవేయవచ్చని, బాధితుల నుంచి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ సరికొత్త విధానం ఎంతగానో దోహదపడుతుందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.



చుక్కలు చూపిస్తున్న విమాన ప్రయాణం.. భారీగా పెరిగిన ధరలు

దేశంలో విమాన ప్రయాణాలు మరింత భారంగా మారాయి. 2026 జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో విమాన ప్రయాణ సేవల ధరలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 35.52 శాతం మేర పెరిగాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాత్కాలిక సర్వీస్ ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (ఎస్పీపీఐ×) నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ప్రభుత్వం పర్యవేక్షిస్తున్న ఏడు ప్రధాన సేవా రంగాల్లో ఇదే అత్యధిక ధరల పెరుగుదల కావడం గమనార్హం.2022–23ను ఆధార సంవత్సరంగా తీసుకుని రూపొందించిన ఈ గణాంకాల ప్రకారం, ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 31.94 శాతంగా ఉన్న విమానయాన ధరల ద్రవ్యోల్బణం, జులై–సెప్టెంబర్ నాటికి మరింత పెరిగింది. ఈ త్రైమాసికంలో ఎయిర్ (ప్యాసింజర్) సర్వీస్ ప్రైస్ ఇండెక్స్ 126.4 నుంచి 127.8కి పెరిగింది. అంటే, కేవలం మూడు నెలల వ్యవధిలోనే 1.1 శాతం వృద్ధి నమోదైందిఒకవైపు విమాన ప్రయాణ ధరలు ఆకాశాన్నంటుతుంటే, మరోవైపు కొన్ని సేవల ధరలు తగ్గుముఖం పట్టడం ఆసక్తికరం. సెక్యూరిటీల లావాదేవీల సేవల ధరలు 6.93 శాతం క్షీణించగా, బ్యాంకింగ్ సేవల ధరల సూచీ 3.96 శాతం తగ్గింది. అయితే, బ్యాంకింగ్ సేవల కంట్రిబ్యూషన్ ఇండెక్స్ మాత్రం 3.86 శాతం పెరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు.ఇతర సేవల రంగాల్లో ధరల పెరుగుదల స్వల్పంగా ఉంది. రైల్వే సేవల ధరలు మొత్తంగా 1.38 శాతం పెరగ్గా, అందులో ప్యాసింజర్ సేవల ధరలు 2.17 శాతం, సరుకు రవాణా ధరలు 0.99 శాతం పెరిగాయి. పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ సేవలు 1.01 శాతం, టెలికమ్యూనికేషన్స్ 0.54 శాతం, ఇన్సూరెన్స్ సేవలు 0.49 శాతం చొప్పున స్వల్పంగా పెరిగాయి.విమాన టికెట్ల ధరల పెరుగుదలకు గల కారణాలను ప్రభుత్వం తన నివేదికలో స్పష్టంగా పేర్కొనలేదు. అయితే, పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాల వల్ల పెరిగిన ఇంధన ధరలే ఇందుకు కారణమని కొన్ని నివేదికలు విశ్లేషిస్తున్నాయి. కాగా, అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన తర్వాతి నివేదికను 2027, ఫిబ్రవరి 24న విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.



ఒక చేతిలో 6 నెలల పాప.. పార్లమెంటులో ప్రసంగం.. ఈ తల్లికి నెటిజన్ల ప్రశంసలు

ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో ఒక అరుదైన, హృద్యమైన దృశ్యం చోటుచేసుకుంది. పశ్చిమ ఆస్ట్రేలియాకు చెందిన ఇండిపెండెంట్ సెనేటర్ ఫాతిమా పేమాన్ తన ఆరు నెలల కుమార్తెను ఎత్తుకుని చట్టసభలో ప్రసంగించి అందరి దృష్టినీ ఆకర్షించారు. రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మాతృత్వాన్ని సమర్థంగా బ్యాలెన్స్ చేయవచ్చని ఆమె నిరూపించారు.ఆస్ట్రేలియా సెనేట్‌లో నవంబర్ 25న ‘ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్ (డిజిటల్ డ్యూటీ ఆఫ్ కేర్) బిల్లు 2026’పై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా సెనేటర్ ఫాతిమా పేమాన్ తన ఆరు నెలల కుమార్తె ఆలియాను చేతుల్లోకి తీసుకుని డిస్పాచ్ బాక్స్ వద్ద నిల్చున్నారు. ఒకవైపు చిన్నారిని ప్రేమగా లాలిస్తూనే, మరోవైపు బిల్లుపై తన వాదనలను వినిపించారు.ఈ సమయంలో ఫాతిమా వెనుక సీట్లో కూర్చున్న మరో ఇండిపెండెంట్ సెనేటర్ లిడియా థోర్ప్.. ఆ చిన్నారితో సరదాగా దోబూచులాడుతూ (పీక్-ఎ-బూ) మురిపించారు. పార్లమెంట్ చర్చల మధ్య చోటుచేసుకున్న ఈ ఆహ్లాదకరమైన సన్నివేశం తాలూకు వీడియో నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.పశ్చిమ ఆస్ట్రేలియా నుంచి పదవిలో ఉండగానే బిడ్డకు జన్మనిచ్చిన మొదటి మహిళా సెనేటర్‌గా ఫాతిమా పేమాన్ గుర్తింపు పొందారు. ఆమె కుమార్తె 2026 మే నెలలో జన్మించింది. గతంలో కూడా ఆమె పార్లమెంట్ వేదికగా మాతృత్వపు అనుభవాలు, ప్రసవానంతర సవాళ్లు, పేరెంటింగ్‌లోని శారీరక, మానసిక ఒత్తిళ్లు మరియు విధుల్లోకి తిరిగి చేరడం వంటి అంశాలపై పలుమార్లు మాట్లాడారు.ఆస్ట్రేలియా సెనేట్ నిబంధనల ప్రకారం మహిళా ఎంపీలు తమ చంటిపిల్లలను సభలోకి తీసుకురావడానికి వెసులుబాటు ఉంది. 2016లో సవరించిన నిబంధనల (స్టాండింగ్ ఆర్డర్స్) ప్రకారం.. సభా కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా, సెనేట్ ప్రెసిడెంట్ అనుమతితో చిన్నపిల్లలను సభలోకి తీసుకురావడమే కాకుండా వారికి పాలివ్వడానికి కూడా అనుమతిస్తారు. చట్టసభల్లో మహిళలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, రాజకీయాల్లో మాతృత్వాన్ని సాధారణ అంశంగా మార్చడంలో ఈ పరిణామం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని పలువురు ప్రశంసిస్తున్నారు. బాధ్యతను, బంధాన్ని ఏకకాలంలో చక్కగా నిర్వర్తించిన ఫాతిమా పేమాన్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

భక్తి భావానికి సేవా పరిమళం..

మాలధారణ స్వాముల అన్నదానానికి
రూ.5 లక్షల సమర్పణ
41 రోజుల పాటు స్వాములకు అన్నప్రసాద వితరణ..
సేవా కార్యక్రమానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ఆర్థిక చేయూత

ప్రజా వాయిస్ / అనుముల:
భక్తి అంటే కేవలం పూజలు, ఆచారాలకే పరిమితం కాకుండా తోటి భక్తుల ఆకలి తీర్చడంలోనూ దైవత్వాన్ని చూడాలనే సేవాభావంతో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ముందడుగు వేశారు. అయ్యప్ప మాలధారణ చేసి మండల దీక్షలో ఉన్న స్వాములకు అన్నప్రసాదం అందించేందుకు నిర్వహిస్తున్న 41 రోజుల అన్నదాన కార్యక్రమానికి రూ. 5 లక్షల ఆర్థిక



సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు.అనుముల మండలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వద్ద అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 10 నుంచి డిసెంబర్ 20, 2026 వరకు 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ అయ్యప్ప దీక్షాధారులైన స్వాములకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తితో దీక్ష చేపట్టిన స్వాములకు అన్నప్రసాదం అందించే పవిత్ర సేవలో భాగస్వామిగా నిలుస్తూ ఎమ్మెల్యే రూ. 5 లక్షల విరాళం అందించారు.దైవభక్తికి మానవీయ సేవ తోడైతేనే ఆధ్యాత్మికతకు మరింత పరిపూర్ణత చేకూరుతుందనే భావనకు ఈ సహకారం నిదర్శనంగా నిలుస్తోంది. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మోహన్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజ రమేష్ యాదవ్, కౌన్సిలర్లు, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కన్నుపడింది-హైడ్రా అడ్డుకట్ట వేసింది

ఖాజాగూడలో రూ.70 కోట్ల విలువైన పార్కు స్థలానికి రక్షణ
3,500 గజాలకు ఫెన్సింగ్
స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా



ప్రజావాయిస్,హైదరాబాద్:
ఐటీ కారిడార్‌లో భూముల ధరలు కోట్లకు చేరడంతో ప్రభుత్వ,ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలపై కబ్జాదారుల కన్ను పడుతోంది.ఈ నేపథ్యంలో ఖాజాగూడలో పార్కు కోసం కేటాయించిన 3,500 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమణ ప్రయత్నాల నుంచి హైడ్రా కాపాడింది. సుమారు రూ.70 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఈ స్థలం చుట్టూ బుధవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పార్కు స్థలంగా గుర్తిస్తూ బోర్డును ఏర్పాటు చేసింది.1974లో గ్రామ పంచాయతీ ఆమోదం పొందిన 25 ఎకరాల విస్తీర్ణంలోని ఈ లేఅవుట్‌లో మొత్తం 262 ప్లాట్లు ఉన్నాయి. లేఅవుట్‌లో రెండు



ఓపెన్ స్పేస్‌ల కోసం మొత్తం 50,200 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. ఇందులో 700 చదరపు గజాల స్థలంలో ఆలయాన్ని నిర్మించారు.మరో 1,000 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరగగా,ఆ స్థలానికి సంబంధించిన వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని స్థానిక ప్లాట్ల యజమానులు తెలిపారు. ఇదే క్రమంలో మిగిలిన 3,500 చదరపు గజాల పార్కు స్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఖాజాగూడ సాయి ఐశ్వర్య ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.లేఅవుట్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలంగా నిర్ధారించుకున్న అనంతరం బుధవారం రంగంలోకి దిగి స్థలం చుట్టూ



ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.పార్కు స్థలంగా గుర్తిస్తూ హైడ్రా బోర్డును సైతం ఏర్పాటు చేశారు.లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకోవడంపై సాయి ఐశ్వర్య ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రాకు మద్దతుగా నినాదాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కోట్ల విలువైన భూముల మధ్య ప్రజలకు అవసరమైన పార్కు స్థలం కాపాడబడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రాణాలు పోయాక మేలుకుంటారా?..

పట్టించుకోని విద్యుత్ యంత్రాంగం!

ఇళ్లపై పడనున్న శిథిల విద్యుత్ స్తంభాలు.. నిప్పుల కుంపటిపై భామ్మీ గ్రామస్థులు
నిన్న బాసరలో రూ.20 లక్షల ఆస్తి నష్టం.. నేడు భామినిలో పొంచి ఉన్న పెను ప్రమాదం
సర్పంచ్ ఫిర్యాదు చేసినా, ప్రజలు మొరపెట్టుకున్నా స్పందించని అధికారులు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి
నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండలంలోని భామిని గ్రామస్థులు ఇప్పుడు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.గ్రామంలోని ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలి ఇళ్లపై పడతాయో తెలియని భయానక పరిస్థితి నెలకొంది.సిమెంట్ పెచ్చులూడి,లోపలి ఇనుప కడ్డీలు తేలి నిలువునా చీలిపోయిన ఈ స్తంభాలు ఏ క్షణమైనా నేలకొరిగేలా ఉన్నాయి.ఒకవేళ అకస్మాత్తుగా ఈ స్తంభాలు కూలి విద్యుత్ తీగలు ఇళ్లపై పడితే,షార్ట్ సర్క్యూట్ జరిగి ఇళ్లు అగ్నికి ఆహుతయ్యే పెను ప్రమాదం పొంచి ఉంది.

బాసర ఘటన కళ్లముందే ఉన్నా.. కదలని యంత్రాంగం
ఇప్పటికే నిర్మల్ జిల్లా బాసర మండలంలో గత రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమై సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించి,ఒక కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ఇంతటి విషాద ఘటన కళ్లముందే జరిగినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులలో మాత్రం కనీస చలనం లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇళ్లు కాలి బూడిదై, నిరుపేద కుటుంబాలు రోడ్డున పడితే తప్ప అధికారులు స్పందించరా? అని భామిని గ్రామస్థులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

సర్పంచ్ చెప్పినా లెక్కచేయని నిర్లక్ష్యం
గ్రామంలో నెలకొన్న ఈ ప్రమాదకర పరిస్థితిని స్వయంగా గ్రామ సర్పంచ్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. స్థానిక ప్రజలు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా సంబంధిత అధికారులు కనీసం స్పందించడం లేదని, నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు.ప్రజల పన్నుల సొమ్ముతో ప్రతినెలా జీతాలు తీసుకుంటున్న అధికారులు,ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన కనీస బాధ్యతను ఎందుకు విస్మరిస్తున్నారని నిలదీస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భామిని గ్రామంలో ప్రమాదకరం గా ఉన్న స్తంభాలను తొలగించి కొత్తవి





ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు

కుల దూషణ, చంపుతామన్న బెదిరింపులతో దళిత వృద్ధుడి ఆత్మహత్యాయత్నం!

కుబీర్ మండలం చాత గ్రామంలో దారుణం..
పురుగుల మందు తాగిన 60 ఏళ్ల పూజారి బాబు
ఇంటి ముందున్న స్థలం విషయంలో గ్రామ పెద్దల సమక్షంలోనే అవమానించిన వైనం
విషమంగా బాధితుడి పరిస్థితి.. బైంసా ప్రైవేటు ఆసుపత్రి ఐసీయూలో చికిత్స
బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల డిమాండ్

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి
నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని చాత గ్రామంలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది.ఇంటి ముందున్న స్థలం విషయంలో కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ అవమానించడమే కాకుండా,చంపుతామని బెదిరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ దళిత వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ప్రస్తుతం ఆయన బైంసాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఐసీయూలో మృత్యువుతో పోరాడుతున్నాడు.గ్రామ పెద్దల సమక్షంలోనే అవమానం.వివరాల్లోకి వెళితే.. చాత గ్రామానికి చెందిన పూజారి బాబు (60) తన ఇంటి ముందు ఉన్న స్థలం వివాదం గురించి గ్రామ పెద్దలతో కలిసి చర్చిస్తున్నాడు.ఇదే సమయంలో అక్కడికి వచ్చిన కొంతమంది వ్యక్తులు బాబును కులం పేరుతో అసభ్యంగా దూషిస్తూ తీవ్రంగా అవమానపరిచారు.అంతటితో ఆగకుండా, “స్థలం మాకు ఇవ్వకపోతే నీ అంతు చూస్తాం, చంపేస్తాం” అంటూ తీవ్ర భయాందోళనకు గురిచేశారు. నలుగురిలో జరిగిన ఈ అవమానాన్ని, ప్రాణభయాన్ని తట్టుకోలేక తీవ్ర ఆవేదనకు గురైన బాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.విషయం గమనించిన స్థానికులు,కుటుంబ సభ్యులు బాబును వెంటనే బైంసా పట్టణంలోని



ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బైంసాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ఒక దళిత వృద్ధుడిని కులం పేరుతో దూషించి,ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించిన వ్యక్తులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కఠిన కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు, బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.